JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । గురువారం 26-02-2026
Medchal - Malkajgiri । Thursday 26-02-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 271
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 271 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com




# ప్రధానికి అరుదైన గౌరవం

*"నరేంద్ర మోడీ ఇజ్రాయెల్ గడ్డపై అడుగు పెట్టడానికి ముందే, ఆయన గౌరవార్థం ఇజ్రాయెల్ నెస్సెట్ భారత జెండా రంగులలో వెలిగిపోయింది. ఈ విషయాన్ని ప్రకటించడానికి నెస్సెట్ స్పీకర్ అమీర్ ఒహానా ఒక ఫోటోను షేర్ చేశారు. ప్రధాని మోదీ పర్యటనపై ఇజ్రాయెల్ మీడియాలో చర్చ జరుగుతోంది. జెరూసలేం పోస్ట్ హిందీలో "నమస్తే మోదీ" అని రాసింది. ప్రధాని మోదీ పర్యటనను కొత్త దశకు నాందిగా అభివర్ణించింది.*

**జయభేరి, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 :**
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన కోసం ఇజ్రాయెల్‌కు బయలుదేరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలికారు. ప్రధాని మోదీ రాకను ప్రకటిస్తూ, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆయనను తన స్నేహితుడిగా అభివర్ణించారు. ఈ రెండు రోజుల్లో, ప్రధాని మోడీ అనేక ముఖ్యమైన రక్షణ, వ్యూహాత్మక అంశాలపై చర్చిస్తారు. తన పర్యటనలో మొదటి రోజు, నెతన్యాహుతో ప్రైవేట్ విందులో పాల్గొన్నారు. అనంతరం ఇజ్రాయెల్ పార్లమెంట్ (నెస్సెట్) ను ఉద్దేశించి ప్రసంగిస్తారు.ఈ సందర్భంగా ఇజ్రాయెల్‌లోని ప్రముఖ పత్రిక జెరూసలేం పోస్ట్ తన మొదటి పేజీలో "నమస్తే మోదీ" అనే శీర్షికతో ఆయన ఫోటోను ప్రచురించింది. పర్యటనకు ముందు, ప్రధాని మోదీ ఇజ్రాయెల్‌లో తన రెండు రోజుల అధికారిక పర్యటన గురించి తెలియజేశారు. భారతదేశం - ఇజ్రాయెల్ బలమైన, బహుముఖ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నాయని, ఇది గత కొన్ని సంవత్సరాలుగా గణనీయంగా పెరిగిందని ఆయన పేర్కొన్నారు.ఈ పర్యటన సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహుతో చర్చలు జరుపుతామని ప్రధాని మోదీ సోషల్ మీడియా ఎక్స్ లో పేర్కొన్నారు. రక్షణ, వ్యవసాయం,

...మిగతాది 2 లో

# ప్రాణాలు తీసిన హంతకులకు ఉరి శిక్ష వేయాలి



- బాధితుల కుటుంబానికి అండగా ఉంటామని
- పసిపాప ప్రాణాలు తీసిన హంతకులకు అండగా నిలబడటం ముమ్మాటికి తప్పే
- పసిపాపను హత్య చేసిన హంతకులను శిక్షించి జైల్లో వేయాలి
- కుమ్మెర జాతర బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్

**జయభేరి, నాగర్కర్నూల్ :**
కుమ్మెర మల్లన్న జాతరలో కాంగ్రెస్ గూండాల దాడిలో మృతి చెందిన రెండు నెలల పసిపాప కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం పరామర్శించారు. బాధితుల కుటుంబానికి అండగా ఉంటామని, వారికి పది లక్షలతో ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చి తక్షణ సహాయంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఆ కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న అన్ని వర్గాల నాయకులను, కార్యకర్తలను కలిసి కుటుంబానికి సంఘీభావం తెలిపారు. కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ సమాజం మొత్తం బాధతో, ఆవేదనతో తలదించుకునే దుర్మార్గమైన సంఘటన కుమ్మెరలో జరిగింది. పసిపాప హంతకులకు అండగా నిలబడ్డ ప్రతి ఒక్కడు ముమ్మాటికి దోషినే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అయినా, స్థానిక ఎమ్మెల్యే, స్థానిక ఎంపీ ఎవరైనా ఆ పసిపాప ప్రాణాలు తీసిన హంతకులకు అండగా నిలబడటం ముమ్మాటికి తప్పే నని అన్నారు. హంతకుడు ఎవరైనా, ఏ పార్టీకి చెందిన వారైనా వారిని జైల్లో పెట్టాలి. దాడి చేసిన 8 మంది పైన ముమ్మాటికి హత్యానేరం కింద కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేసారు. దిత కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం అందించాలి. పసిపాపను హత్య చేసిన హంతకులను శిక్షించి జైల్లో వేయాలి, అవసరమైతే ఉరిశిక్ష వేయాలి కానీ బయటకి వదలవద్దని కేటీఆర్ డిమాండ్ చేసారు.

# వీఎస్ఆర్ వెంచర్స్‌తో సంబంధాలపై లోకేష్ కీలక వ్యాఖ్యలు

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రిన్సిపాల్, తామంతా స్టూడెంట్స్

**జయభేరి, విజయవాడ, ఫిబ్రవరి 25 :**
ఏపీ అసెంబ్లీ లాబీల్లో మంత్రి నారా లోకేష్ మీడియా ప్రతినిధులతో జరిపిన చిట్ చాట్ లో కీలక వ్యాఖ్యలుచేశారు. ముఖ్యంగా మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మరణానికి కారణం అయిన విమానం యజమాని వీఎస్ఆర్ ఏవియేషన్స్‌తో హెరిటేజ్ సంస్థకు సంబంధాలు ఉన్నాయన్న విపక్షాల ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. హెరిటేజ్ సంస్థకు వీఎస్ఆర్ ఏవియేషన్స్‌తో ఎలాంటి వ్యాపార లావాదేవీలు లేవని, ఆ సంస్థతో కలిసి ఒక కప్పు కాఫీ కూడా తాగలేదని ఆయన ఎద్దేవా చేశారు. కేవలం 2022లో ఆ సంస్థ తమ వద్ద ఫైనాన్స్ తీసుకుందని, ఆ సమయంలో తాము అధికారంలోకి వస్తామని గానీ, తమ ఎంపీ ఏవియేషన్ మంత్రి అవుతారని గానీ ఊహించడానికి తామేమీ జ్యోతిష్యులం కాదని లోకేష్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. లిక్కర్ స్కాం విషయంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన చిల్లర దొంగలను పట్టుకుని గజదొంగలను వదిలేస్తున్నారు అన్న వ్యాఖ్యలకు లోకేష్ ధీటుగా కౌంటర్ ఇచ్చారు. బొత్స ఉద్దేశించిన ఆ గజదొంగ జగన్ మోహన్ రెడ్డేనా అని ఆయన ప్రశ్నించారు. జగన్‌ను పట్టుకోవాలని బొత్స కోరుకుంటున్నారా అని నిలదీశారు. మద్యం స్కాంలో సిట్ విచారణలో తేలింది కూడా అదేనని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో తమపై స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్ నెట్, ఇన్నర్



రింగ్ రోడ్డు వంటి అనేక తప్పుడు కేసులు పెట్టారని, కానీ గవర్నర్ లేదా స్పీకర్ వంటి కాంపిటెంట్ అథారిటీలకు ఒక్క ఆధారమైనా చూపించగలిగారా అని ఆయన సవాల్ విసిరారు. శాసన సభ్యుల పనితీరును మెరుగుపరిచేందుకు కొత్తగా ఓరియంటేషన్ క్లాసులు నిర్వహించబోతున్నట్లు లోకేష్ వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఒక యూనివర్సిటీ తరహాలో అభివర్ణిస్తూ, దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రిన్సిపాల్ అని, తామంతా స్టూడెంట్స్' అని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ రెసిడెన్షియల్ క్లాసుల్లో

...మిగతాది 2 లో

# ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం




- డయోరియా, కల్తీ పాలు ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష

**జయభేరి, అమరావతి :**
శ్రీకాకుళం డయేరియా, రాజమండ్రి పాల ఘటనలపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, ఆయా జిల్లాల అధికారులతో మాట్లాడారు. శ్రీకాకుళం, రాజమండ్రి ఘటనల్లో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిపై సీఎం వాకబు చేసారు. శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రిలో సీరియస్ కండిషన్లో ఉండి చికిత్స పొందుతున్న ఇద్దరి బాధితుల ఆరోగ్యం గురించి సీఎం చంద్రబాబు ఆరా తీసారు. ఒకరు వెంటిలేటర్ మీద చికిత్స పొందుతున్నారని.. మరొకరికి డయాలసిస్ అందిస్తున్నామని అధికారులు సీఎం కు చెప్పారు. వీరిద్దరి వైద్య

...మిగతాది 2 లో



# ఏఐపై చర్చ

- సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన అడోబ్ సీఈఓ శంతను నారాయణ్

**జయభేరి, హైదరాబాద్ :**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అడోబ్ సీఈవో శంతను నారాయణ్ కలిశారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డితో శంతను నారాయణ్ భేటీ కావడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లోనూ తనదైన ముద్ర వేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ గురించి.. రేవంత్ రెడ్డి, శంతను నారాయణ్ చర్చించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన తెలంగాణ రైజింగ్ బోర్డు సభ్యుడిగా కూడా శంతను నారాయణ్ కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కొత్త అవకాశాలు, గ్లోబల్ ట్రెండ్స్‌పై వారిద్దరూ చర్చించారు. వివిధ రంగాల్లో ఏఐతో ఉద్యోగాలపై పడే ప్రభావం, గ్రీన్ ఎనర్జీ, రాష్ట్ర ప్రభుత్వం పరంగా చేపట్టాల్సిన పలు చర్యలు సహా పలు అంశాలపై వారిద్దరి మధ్య లోతైన చర్చ జరిగినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను సమర్థవంతంగా

...మిగతాది 2 లో



# పెళ్లికొడుకులు కాదు కీచకులు

- అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలని సజ్జనార్ సలహా

**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 25 :**
పెళ్లి పేరుతో జరుగుతున్న మోసాలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. కేవలం ప్రేమ పేరుతో మాత్రమే కాదు, పెద్దలు కుదిర్చిన సంబంధాల విషయంలోనూ కొందరు నయవంచకులు యువతులను మోసం చేస్తున్నారని అమ్మాయిలు చాలా జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ సూచించారు. ఇలాంటి ఘటనలపై గత కొంతకాలం నుంచి హైదరాబాద్ షీ టీమ్స్‌కు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు.ముందుగా సంప్రదాయబద్ధంగా పెళ్లి చూపులు జరుగుతాయి. ఆపై ఎంగేజ్‌మెంట్ జరిపిస్తారు. ఇక మాకు పెళ్లి ఖాయమైంది కదా అనే చనువుతో యువకులు ఆ యువతులకు దగ్గరవుతున్నారు. ఎలాగూ పెళ్లి చేసుకుంటున్నాం కదా.. పని ఇప్పుడైతే ఏంటి? అని మాయమాటలు చెప్పి, కొందరు యువతులను ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. ఒత్తిడి పెంచి యువతులను శారీరకంగా లోబచుకుంటున్నారు. తీరా తమ కోరిక తీరాక వారి అసలు రంగు బయట పడుతుంది. పెళ్లి పీటలు ఎక్కాలంటే తమకు భారీగా డబ్బు కావాలని, అదనపు కట్నం ఇస్తేనే పెళ్లి జరుగుతుందని లేకపోతే మ్యారేజ్ క్యాన్సిల్ చేసుకుంటామని బెదిరింపులకు పాల్పడుతున్నారు' అని సజ్జనార్ యువతులను

...మిగతాది 2 లో



మొదటిపేజీ తరువాయి

## ఏఐపై చర్చ

వినియోగించుకోవడంపై శంతను నారాయణ్‌తో సీఎం రేవంత్ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తెలంగాణను ఏఐ మాన్యుఫ్యాక్చరింగ్ పవర్‌గా తీర్చి దిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. అందుకోసం కొన్ని కీలక సంస్థలను ఆకర్షించేలా ప్రణాళికలు తయారు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన చర్యలను రేవంత్ రెడ్డికి శంతను నారాయణ్ వివరించారు. గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్, గ్రీన్ ఎనర్జీ, ఉద్యోగాలపై ఏఐ ప్రభావం, స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ వంటి అంశాలపై రేవంత్ రెడ్డికి, శంతను నారాయణ్ చర్చించారు. ఆర్థిక వ్యవస్థపై ఏఐ రెవల్యూషన్ ప్రభావం.. రానున్న రోజుల్లో ఏఐని మరింత సమర్థంగా ఉపయోగించుకునే అంశాలపై శంతను నారాయణ్‌తో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. తెలంగాణను అభివృద్ధిలో మరింత ముందుకు నడిపించేందుకు సహకరించాలని ఈ సందర్భంగా శంతను నారాయణ్‌ను సీఎం కోరారు. ఇక ఇటీవలె ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సదస్సులో హాజరై ప్రసంగించిన రేవంత్ రెడ్డి.. కేంద్ర, రాష్ట్రాల్లో ఏఐ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రపంచ టెక్నాలజీలో ఏఐ రాకతో సమూల మార్పులు వచ్చాయని తెలిపారు. ఏఐని ఉపయోగించడం, దాన్ని నియంత్రించడం, ఏఐకి సంబంధించిన మార్గదర్శకాలు, ఏఐతో జాతీయ భద్రత వంటి అంశాల కోసం ఈ ఏఐ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడం అత్యవసరమని పేర్కొన్నారు.

## పెళ్లికొడుకులు కాదు.. కీచకులు

అప్రమత్తం చేశారునిశ్చితార్థం జరిగిపోవడం, బంధుమిత్రులు అందరికీ మీ పెళ్లి గురించి తెలిసిపోతుంది. కనుక ఇప్పుడు పెళ్లి ఆగిపోతే తమ కుటుంబం పరువు ఎక్కడ పోతుందోనన్న భయంతో చాలామంది యువతులు, వారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెనుకడుగు వేస్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న కొందరు కేటుగాళ్ళు, అడిగినంత డబ్బు ఇవ్వాలంటూ అమ్మాయిల తల్లిదండ్రులను వేధిస్తున్నారు. పరువు పోతుంది అని భయపడి మౌనంగా ఉంటే మాత్రం మీరు జీవితాంతం నరకం అనుభవించాల్సి వస్తుంది. నిశ్చితార్థం అయినా సరే, పెళ్లి పీటలు ఎక్కేవరకు కూడా ప్రతి యువతి అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు. 'పెద్దలు కుదిర్చిన సంబంధమే కదా అని ఎవరినీ గుడ్డిగా నమ్మొద్దు. అబ్బాయి ప్రవర్తన, స్నేహితులు, అలవాట్లపై తప్పక ఆరా తీయాలి. కానీ పెళ్లికి ముందే ఏకాంతంగా కలవడానికి, శారీరక సంబంధానికి ఒత్తిడి చేస్తే అలాంటి వ్యక్తులను కచ్చితంగా అనుమానించాలి. ఈ సమయంలో వారి ప్రతిపాదనను ధైర్యంగా తిరస్కరించడంతో పాటు.. డబ్బు డిమాండ్ చేసినా, బ్లాక్ మెయిల్ చేసినా భయపడకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని' సజ్జనార్ సలహా ఇచ్చారు.ఎవరైనా మోసపోయి ఉంటే, ఇంకా తమకు అన్యాయం జరుగుతోందని భావిస్తే ధైర్యంగా ముందుకు రావాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఇలాంటి సమస్యలు ఎదురైతే వెంటనే హైదరాబాద్ షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 9490616555కు గానీ, డయల్ 100 కు గానీ కాల్ చేసి ఫిర్యాదు చేయాలని యువతులు, వారి కుటుంబాలకు సజ్జనార్ సూచించారు.

## ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

చికిత్సపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఎం ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఇంకా ఏమైనా కేసులు నమోదవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం ఘటనలో ప్రస్తుతానికి 76మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు. ఇద్దరు మినహా అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వివరించారు. పైప్ లైన్ ద్వారా నీటి సరఫరాను ఆపేశామని.. ప్రత్యామ్నాయాల ద్వారా సురక్షితమైన తాగు నీటిని సరఫరా చేస్తున్నామని వివరించారు. రాజమండ్రి పాల ఘటనలో బాధితులు నిరంతర వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని తెలిపారు. పాల శాంపిళ్లను ఇప్పటికే ల్యాబ్ కు పంపాం. శాఖపరంగా దీనిపై ప్రత్యేక ఫోకస్ పెట్టామని అధికారులు వెల్లడించారు. ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని.. నిర్లక్ష్యం వహించొద్దని అధికారులకు సీఎం ఆదేశించారు. ఇలాంటి ఘటనలు రిపీట్ కాకుండా వివిధ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

## ..లోకేష్ కీలక వ్యాఖ్యలు

ఎమ్మెల్యేలందరూ పాల్గొంటారని, తాను కూడా వారి పక్కనే కూర్చుని పాఠాలు వింటానని చెప్పారు. ప్రజాప్రతినిధులు సభలో ఎలా వ్యవహరించాలి, పాలనలో మెళకువలు వంటి అంశాలపై ఇక్కడ శిక్షణ ఉంటుందని వివరించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలతో నిర్వహించే సమావేశాల గురించి ప్రస్తావిస్తూ, ఇవి కేవలం రాజకీయాల కోసం కాదని, ఒక కుటుంబం అనే కాన్సెప్ట్‌తో జరుగుతున్నాయని లోకేష్ స్పష్టం చేశారు. ఈ ఆత్మీయ భేటీల్లో రాజకీయ చర్చలకు తావుండదని, కేవలం ఒకరినొకరు కలుసుకుని ఆత్మీయతను పంచుకోవడమే లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయం కోసం, యువ నాయకత్వాన్ని ప్రోత్సహించే దిశగా తాము అడుగులు వేస్తున్నామని లోకేష్ తెలిపారు.

## ప్రధానికి అరుదైన గౌరవం

సాంకేతికత, ఆవిష్కరణ, సైబర్ భద్రత, వాణిజ్యం వంటి వివిధ రంగాలలో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునే మార్గాలను ఇరుపక్షాలు చర్చిస్తాయి. అలాగే, ప్రధాన మంత్రి మోదీ ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌ను కూడా కలుస్తారు. ఈ సమావేశం రెండు దేశాల మధ్య ఉన్నత స్థాయి రాజకీయ విశ్వాసం, భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఒక అవకాశంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.ప్రధానమంత్రి మోదీ ఇజ్రాయెల్ పార్లమెంట్ అయిన నెస్సెట్‌ను ఉద్దేశించి కూడా ప్రసంగిస్తారు. నరేంద్ర మోడీ ఇజ్రాయెల్ గడ్డపై అడుగు పెట్టడానికి ముందే, ఆయన గౌరవార్థం ఇజ్రాయెల్ నెస్సెట్ భారత జెండా రంగులలో వెలిగిపోయింది. ఈ విషయాన్ని ప్రకటించడానికి నెస్సెట్ స్పీకర్ అమీర్ ఒహానా ఒక ఫోటోను షేర్ చేశారు. ప్రధాని మోదీ పర్యటనపై ఇజ్రాయెల్ మీడియాలో చర్చ జరుగుతోంది. జెరూసలేం పోస్ట్ హిందీలో "నమస్తే మోదీ" అని రాసింది. ప్రధాని మోదీ పర్యటనను కొత్త దశకు నాందిగా అభివర్ణించింది.పార్లమెంటులో ప్రధానమంత్రి ప్రసంగంపై కూడా వివాదం చెలరేగింది. యెష్ అతిద్ పార్టీకి చెందిన యైర్ లాపిడ్ నేతృత్వంలోని ప్రతిపక్షం, సుప్రీంకోర్టు అధ్యక్షుడు ఐజాక్ అమిత్‌ను ఆహ్వానించకపోతే నెస్సెట్‌లో మోదీ ప్రసంగానికి హాజరు కాబోమని తెలిపింది. విదేశీ అతిథులను సత్కరించే ఇటువంటి ప్రత్యేక సమావేశాలకు ఇది సాధారణం. ఈ కార్యక్రమం రాజకీయ సమస్యగా మారకుండా నిరోధించడానికి పూర్తి భాగస్వామ్యం అవసరమని చెబుతూ, నెస్సెట్ స్పీకర్ అమీర్ ఒహానాను ఆహ్వానం అందించమని జోక్యం చేసుకుని ఆదేశించాలని లాపిడ్ నెతన్యాహుకు బహిరంగంగా విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ పర్యటనకు ముందు, యైర్ లాపిడ్ X లో పోస్ట్ చేస్తూ, "ఇజ్రాయెల్ అంతా ప్రధానమంత్రి మోదీని స్వాగతించడానికి ఎదురుచూస్తోంది. ఇజ్రాయెల్ - భారతదేశం మధ్య సంబంధం కేవలం వ్యూహాత్మకమైనది కాదు, దేశాల మధ్య లోతైన స్నేహ బంధం." అని పేర్కొన్నారు.ఇదిలావుంటే భారతదేశం - ఇజ్రాయెల్ మధ్య పంచుకున్న బలమైన పార్లమెంటరీ సంప్రదాయాలు, ప్రజాస్వామ్య విలువలకు ఇది చిహ్నం అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న భారతీయ సమాజ సభ్యులను కూడా తాను కలుస్తానని ఆయన పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య స్నేహం, సహకారాన్ని బలోపేతం చేయడంలో భారతీయ సమాజం ముఖ్యమైన పాత్ర పోషించింది. ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త దిశ, వేగాన్ని పెంచడంలో ఈ పర్యటన ముఖ్య ఉద్దేశ్యమని ప్రధాని మోదీ పేర్కొన్నారు.ఇదిలావుంటే, 2017లో నరేంద్ర మోదీ చరిత్ర సృష్టించారు. ఇజ్రాయెల్‌ను సందర్శించిన తొలి భారత ప్రధానమంత్రిగా ఆయన నిలిచారు. బెన్ గురియన్ విమానాశ్రయంలో ఆయన విమానం దిగినప్పుడు, ఆ క్షణం భారతదేశం - ఇజ్రాయెల్ రెండింటికీ ప్రత్యేకంగా మారింది. ఇది కేవలం ప్రభుత్వ పర్యటన మాత్రమే కాదు, రెండు దేశాల మధ్య సంబంధాలలో ఒక మలుపు. చాలా సంవత్సరాలుగా, భారతదేశం - ఇజ్రాయెల్ మధ్య సంబంధాలు నిరాడంబరమైన స్థాయిలోనే ఉన్నాయి, కానీ ఈ పర్యటన తర్వాత, రెండు దేశాలు బహిరంగంగా కలిసి పనిచేయడం ప్రారంభించాయి. ఇజ్రాయెల్‌ను సందర్శించిన తొలి భారత ప్రధానమంత్రి కావడం తనకు చాలా గర్వంగా ఉందని అప్పట్లో ప్రధాని మోదీ అన్నారు. దీనిని ఒక చారిత్రాత్మక, ముఖ్యమైన అడుగుగా ఆయన అభివర్ణించారు.

# ఆసక్తకరంగా తమిళ రాజకీయాలు



తమిళనాడు రాజకీయాల్లో సంచలనం చోటుచేసుకుంది.తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంటోంది. 'తమిళగ వెట్రి కళగం పార్టీ అధ్యక్షుడిగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన సినీ నటుడు దళపతి విజయ్ . అధికార డీఎంకే సీఎం ఎంకె స్టాలిన్ లక్ష్యంగా విమర్శల దాడిని తీవ్రం చేశారు. వేలూర్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న ఆయన.. అధికార పక్షంపై సంచలన ఆరోపణలు చేశారు. రాబోయేది కేవలం ఎన్నికలు కాదని, అవినీతి ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రజలకు మధ్య జరగబోయే మహా యుద్ధమని, ఇందులో అంతిమ విజయం ప్రజలదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి, అందరూ చిన్నమ్మ అని పిలుచుకునే శశికళ తన కొత్త రాజకీయ ప్రస్థానాన్ని అధికారికంగా ప్రారంభించారు. జయలలిత జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆమె తన కొత్త రాజకీయ పార్టీ జెండాను ఆవిష్కరించారు. శశికళ ఆవిష్కరించిన పార్టీ జెండాను నలుపు, తెలుపు, ఎరుపు రంగులతో ఉంది. అత్యంత ప్రాముఖ్యత కలిగిన అంశం ఏంటంటే.. ఈ జెండా మధ్యలో ద్రవిడ రాజకీయ దిగ్గజాలు అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత ముఖచిత్రాలను పొందుపరిచారు. తద్వారా తానే జయలలిత అసలైన రాజకీయ వారసురాలినని ఆమె పరోక్షంగా కేడర్‌కు సంకేతాలు పంపారు.సభలో ప్రసంగిస్తూ శశికళ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. జయలలిత మరణం తర్వాత తనపై జరిగిన దుష్ప్రచారాన్ని గుర్తు చేసుకుని ఆమె కన్నీరు పెట్టుకున్నారు. జయలలిత నేనే హత్య చేశానని ప్రచారం చేసి నా మనసును గాయపరిచారు.

జయలలిత మరణించిన సమయంలో నేను తీవ్రమైన దుఃఖంలో ఉన్నాను. అందుకే అప్పుడు చాలా మంది బతిమలాడినా నేను పార్టీ అధ్యక్ష పదవిని గానీ, సీఎం పదవిని గానీ తీసుకోలేదు అని శశికళ ఆవేదన వ్యక్తం చేశారుప్రస్తుత అన్నాడీఎంకే అగ్ర నాయకత్వంపై ఆమె నిప్పులు చెరిగారు. పన్నీర్ సెల్వం అప్పట్లో ఆయన తనను తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. పళనిస్వామిని సీఎంను చేయడం తాను చేసిన అతి పెద్ద పొరపాటు అని ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన తర్వాత తనను ఒక చిత్తుకాగితంలా చూశారని, చివరకు హీనంగా పార్టీ నుంచి బహిష్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు.జయలలిత చనిపోయిన తర్వాత తమిళనాట అనేక చిత్ర విచిత్రాలు జరిగాయని, ఇకపై తాను మౌనంగా ఉండబోనని శశికళ స్పష్టం చేశారు. "తమిళ రాజకీయాల్లో ఇక నా మార్క్ చూపిస్తాను.. ప్రజల కోసం యాక్టివ్‌గా పని చేస్తాను" అని ఆమె ప్రకటించారు. పార్టీ పేరు, విధివిధానాలపై త్వరలోనే స్పష్టమైన ప్రకటన చేస్తానని ఆమె తెలిపారు.ప్రభుత్వ అవినీతిని, అక్రమాలను తాను నిర్భయంగా ప్రశ్నిస్తున్నందుకే అధికార పార్టీ తనను ప్రధాన లక్ష్యంగా చేసుకుందని విజయ్ ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను కలవకుండా అడ్డుకునేందు కు టీవీకే పార్టీ సభలకు సైతం ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అనుమతులు నిరాకరిస్తోందని మండిపడ్డారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా, కుట్రలు పన్నినా తాను వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. "ఇప్పుడు నన్ను ప్రజల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకోవచ్చు.. కానీ ఎన్నికల్లో గెలిచి మా పార్టీ అధికారంలోకి వచ్చాక నేనే స్వయంగా ప్రతి గ్రామాన్ని సందర్శిస్తాను" అని విజయ్ సభాముఖంగా హామీ ఇచ్చారు.రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, నేరాలను అరికట్టడంలో స్టాలిన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విజయ్ ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎలాగైనా ఓడించాలనే లక్ష్యంతోనే సీఎం స్టాలిన్ కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. పరిస్థితులకు అనుగుణంగా అవకాశవాద రాజకీయాలు చేయడం డీఎంకేకు వెన్నతో పెట్టిన విద్య అని, రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతో వారు బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు ఓటు వేయడమంటే.. పరోక్షంగా బీజేపీకి ఓటు వేసినట్లేనని ఆయన కుండబద్దలు కొట్టారు.తాము అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత సురక్షితమైన ప్రాంతంగా మారుస్తానని విజయ ప్రతిజ్ఞ చేశారు. ముఖ్యంగా విద్య, భద్రతపై కీలక హామీలు ఇచ్చారు. నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులు పోటీ పరీక్షల శిక్షణ కోసం లక్షల రూపాయలు ప్రైవేట్ సంస్థలకు పోయాల్సిన అవసరం లేకుండా .. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే ఉచితంగా నాణ్యమైన శిక్షణను అందిస్తామన్నారు. మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సైతం బాలికల కోసం పరిశుభ్రమైన, సురక్షితమైన మరుగుదొడ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. నేర రహిత సమాజం కోసం, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# చిన్నారి పునర్వికి కోసం కదిలిన తెలుగు ప్రజలు






జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 25 :


మానవత్వం గెలిచింది. అరుదైన వ్యాధితో పోరాడుతున్న 11 నెలల చిన్నారి పునర్విక ప్రాణాలను కాపాడేందుకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఏకమయ్యారు. సోషల్ మీడియా వేదికగా ఒక మహాయజ్ఞంలా సాగిన క్రౌడ్ ఫండింగ్ విజయవంతమైంది. చిన్నారి చికిత్సకు అవసరమైన భారీ మొత్తం సమకూరడంతో ఇకపై ఎవరూ విరాళాలు పంపవద్దని పాప తండ్రి సురేశ్ కుమార్ వీడియో ద్వారా విజ్ఞప్తి చేశారు. తన కుమార్తెకు సాయం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.సోషల్ మీడియా ద్వారా విజయవంతమైన క్రౌడ్ ఫండింగ్.. సమకూరిన చికిత్స ఖర్చులు

కర్నూలు జిల్లా వెల్దుర్తికి చెందిన సురేశ్ కుమార్, పుష్పావతి దంపతుల కుమార్తె పునర్విక.. స్పైనల్ మస్కులర్ అట్రోఫీ (SMA) టైప్ 1 అనే అత్యంత అరుదైన వ్యాధితో బాధపడుతోంది. దీని చికిత్సకు వాడే ఇంజెక్షన్ ఖరీదు రూ.16 కోట్లు అని వైద్యులు చెప్పడంతో ఆ పేద కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. ఈ విషయం తెలిసిన వెంటనే తెలుగు రాష్ట్రాలకు చెందిన కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు రంగంలోకి దిగారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌ల ద్వారా చిన్నారి పరిస్థితిని వివరిస్తూ క్యాంపెయిన్ ప్రారంభించారు. ఈ పిలుపునకు యువత, ప్రజల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ముఖ్యంగా 'ట్రావెల్ విత్ జగదీష్' అనే ఇన్ఫ్లుయెన్సర్ ఒక్కరే రూ.కోటిన్నరకు పైగా సేకరించడం విశేషం. ఇలా ప్రజల నుంచి మొత్తం రూ.8.53 కోట్లకు పైగా విరాళాలు అందగా, ప్రభుత్వ సాయంతో కలిపి చికిత్సకు కావాల్సిన నిధులు సమకూరాయి.ప్రస్తుతం పాప ఆసుపత్రిలో ఉందని, నాలుగైదు రోజుల్లో ఆమె ఆరోగ్యం, చికిత్స వివరాలపై పూర్తి అప్‌డేట్ ఇస్తానని సురేశ్ కుమార్ తెలిపారు. పునర్నవిక ఉదంతం కేవలం ఒక వైద్య చికిత్స విజయం మాత్రమే కాదు, అది సామూహిక మానవత్వానికి దక్కిన ఘనవిజయం. స్వార్థం రాజ్యమేలుతున్న ఈ రోజుల్లో కూడా, ఒక చిన్నారి నవ్వు కోసం కులమతాలకు, ప్రాంతాలకు అతీతంగా లక్షలాది మంది చేతులు కలపడం నిజంగా ఒక అద్భుతం. ఈ పునర్జన్మ కథ చదివిన ప్రతి ఒక్కరికీ మనుషులపై నమ్మకాన్ని, ఆశను కలిగిస్తోంది. పసిపాప పునర్నవిక త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో ఆడుకోవాలని ఆశిద్దాం. చికిత్సకు అవసరమైన దానికంటే ఎక్కువగానే నిధులు అందాయని, మిగిలిన డబ్బును తనలాగే ఇబ్బంది పడుతున్న ఇతర చిన్నారుల వైద్యానికి అందిస్తానని ఆయన ప్రకటించడం అందరినీ కదిలించింది. వాస్తవానికి ఇంజెక్షన్ ఖర్చు కూడా అంచనా వేసిన దానికంటే తక్కువగా, సుమారు రూ.10 కోట్ల లోపే ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు. ఒక చిన్నారి ప్రాణం కోసం తెలుగు ప్రజలు చూపిన చొరవ, మానవత్వానికి నిలువుటద్దంగా నిలిచింది.

# శ్రీరామావతారంలో యాదగిరీశుడు

- నేత్రపర్వంగా సాగుతున్న శ్రీలక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు
- నేడు దివ్య విమాన రథోత్సవం

జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 25:



తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం శ్రీరామావతారంలో హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ పాంచరాత్రాగమ శాస్త్రానుసారముగా ఆలయ ప్రధానార్చకులు, ఉపప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేదపండితులు,అర్చక బృందం,పారాయణీకులు స్వామి వారిని శ్రీరామావతారంలో అలంకరించి ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆస్థాన మండపంలో వేంచింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ పూజా వేడుకల్లో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు,ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహ్మమూర్తి, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్, ప్రధానార్చకులు కాదూరి వెంకటాచార్యులు, సురేంద్రాచార్యులు, ఉపప్రధానార్చకులు నర్సింహ్మమూర్తి, మాధవాచార్యులు,మణికంఠ శ్రీధర్,లక్ష్మణా చార్యులు, వేదపండితులు శ్రీనివాసశర్మ, శ్రీవాస్తవ శర్మ,అర్చకులు కిరణాచార్యులు, శ్రీనివాసాచార్యులు, ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్‌శర్మ,ఆలయ అధికారులు రఘు, రాజన్‌బాబు,సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**అలరించిన ధార్మిక,సంగీత మహాసభలు..**

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ధార్మిక, సంగీత మహాసభలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. యాదగిరిగుట్టకు చెందిన శ్రీవైష్ణవ సేవా సమాఖ్య వారిచే విష్ణుసహస్రనామ పారాయణం,హరికథా గానం ఎంతో ఆకట్టుకుంది. అంతేకాకుండా భజన, మంగళవాయిద్యం,వైదిక ప్రార్ధన,హరికథ,కూచిపూడి, భక్తి సంగీతం,వయోలిన్, భరతనాట్య ప్రదర్శనలు భక్తులకు ఎంతో అలరించాయి.

**ఉచిత వైద్యశిబిరం..**

శ్రీలక్ష్మీనర సింహస్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కొండపైన ప్రధాన కార్యాలయం ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు,స్థానికులు ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకుంటున్నారు.

**శ్రీవారి నిత్యరాబడి..**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి నిత్యరాబడిలో భాగంగా వివిధ శాఖల నుండి రూ.12,35,868 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.


**నేడు దివ్య విమాన రథోత్సవం..**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీమహావిష్ణు అలంకారంలో గరుడవాహనపై స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రి 7.30 గంటలకు స్వామి వారి దివ్య విమాన రథోత్సవం జరగనుంది.


# శ్రీలక్ష్మీనరసింహుడి పరిణయ మహోత్సవం

- పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన తెలంగాణ రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ
- బ్రహ్మోత్సవం..బ్రహ్మోత్సవం..లోక శాంతికై యాదగిరి శ్రీలక్ష్మీనరసింహుడి కల్యాణమహోత్సవం..
- స్వయంభూ దేవుడికి ముక్కోటి దేవతల ఆశీర్వచనం..
- భక్తకోటి దర్శించుకోగా పంచభూతాల సాక్షిగా శ్రీలక్ష్మీనరసింహుడి కల్యాణం.. కమనీయం..
- రమణీయం.. శ్రీలక్ష్మీనరసింహుడి నామస్మరణతో పులకించిన యాదగిరి కొండ...లోక సుభిక్షంకై వేదపండితుల మంత్రోచ్చరణకు సకల దేవతల ఆశీర్వచనం..
- శ్రీనారసింహుడి బ్రహ్మోత్సవ వైభవం...

జయభేరి, యాదగిరిగుట్ట:







సర్వం తానై సకల లోకాలను రక్షణ గావించే భగవంతుడు స్వయంభూ దేవుడైన యాదగిరి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో లోకశాంతికై స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా..భక్తకోటికి కన్నులపండువగా జరిగింది. తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రం యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. బుధవారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి తిరుకల్యాణ మహోత్సవాన్ని శ్రీపాంచరాత్రాగమ శాస్త్రానుసారం వేదమంత్రోచ్చరణతో నిర్వహించగా అశేష భక్తజనులు దర్శించుకొని తరించారు.

ఉత్సవాలలో భాగంగా ఉదయం స్వామి వారిని ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీరామావతారంలో హనుమంత వాహన సేవలో భక్తకోటికి దర్శనమిచ్చారు. రాత్రి శ్రీలక్ష్మీనృసింహుడి కల్యాణం శాస్త్రానుసారం నిర్ణయించిన సుముహూర్తంలో జరిగింది. వధూవరులుగా అలంకరించిన శ్రీనారసింహుడు,అమ్మవారిని గజవాహన సేవపై మేళతాళాల మధ్య వేదమంత్రాలతో ఆలయ పురవీధులలో ఊరేగించి కల్యాణ మండపానికి రాత్రి 9.50 నిమిషాలకు స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చారు. కల్యాణమూర్తులైన శ్రీస్వామి, అమ్మవార్లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర బీసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి దంపతులు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దంపతులు, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు దంపతులు, యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్ పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందజేశారు. ఆలయ ప్రధానార్చకులు, వేద పండితులు, అర్చకులు శాస్త్రానుసారం మంత్రోచ్చరణ చేస్తూ కల్యాణ తంతుకు విఘ్నేశ్వర పూజతో శ్రీకారం చుట్టారు.

దేవదేవుడి కల్యాణమహోత్సవాన్ని ముక్కోటి దేవతలను ఆహ్వానించి రక్షాబంధన్ నిర్వహించారు. కల్యాణతంతులో స్వామి వారికి యజ్ఞోపవేతం,జీలకర్ర బెల్లం కన్యాదానం, మాంగళ్యధారణ మహోత్సవ ఘట్టాలను అర్చక స్వాములు విశిష్టతను తెలియజేస్తూ శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహుడి కల్యాణం లోకశాంతి కోరుతూ సకల దేవతల ఆశీర్వచనం కోరుతూ మంత్రోచ్చరణ సాగించారు. కల్యాణమూర్తులైన శ్రీనారసింహుడికి తలంబ్రాల వేడుకను కన్నులపండువగా నిర్వహించగా భక్తకోటి తిలకించి తరించారు. శ్రీలక్ష్మీనారసింహుడు అమ్మవారికి మాంగళ్యధారణ క్షణంలో గోవింద నామ స్మరణతో పాటు శ్రీనారసింహ నమో నమః అంటూ భక్తజనుల నామస్మరణతో యాదాద్రి కొండ పులకించింది. కల్యాణ మహోత్సవానికి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ,మిరమిట్లు కొలిపే బాణసంచాల పేలుళ్లతో ఆధ్యాత్మిక శోభతో స్వామి వారి పరిణయం కమనీయం.. రమణీయంగా సాగింది. ఆలయ ప్రధానార్చకులు కాదూరి వెంకటాచార్యులు, సురేంద్రాచార్యులు, వేదపండితులు శ్రీనివాసశర్మ, ఉపప్రధానార్చకులు మాధవాచారి, నర్సింహ్మమూర్తి, అర్చక స్వాములు కిరణాచార్యులు, శ్రీవత్స్యశర్మ, శ్రీకాంతాచార్యులు, రాకేషాచార్యులు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు.

కల్యాణమహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సతీమణి సుధాదేవి దంపతులు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహ్మమూర్తి,ఈవో భవానీ శంకర్,డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌రావు, భువనగిరి ఆర్టీవో కృష్ణారెడ్డి, యాదగిరిగుట్ట, భువనగిరి మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్‌గౌడ్, తంగళ్ళపల్లి శ్రీవాణిరవి, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, ఆలయ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, బీసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు..**

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణమహోత్సవానికి పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి,ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య స్వయం భూ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేశారు.





# కందూర్ జాతర పోస్టల్ విడుదల చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని అడ్డాకుల మండలం కందూర్ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల పోస్టర్ ను బుధవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ కు ఆలయా తరఫున ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో దేవాలయం అర్చకులు, ఈఓ, కందూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే జిఎంఆర్




జయభేరి, దేవరకద్ర :

హైదరాబాద్ లో బుధవారం జరిగిన పలు వివాహ శుభకార్యాలలో మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు.

# బాసర విద్యార్థిని ఆత్మహత్య

జయభేరి, నిర్మల్ :

నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటి లో ఈ1 మొదటి సంవత్సరం చదువుతున్న వసంత అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. విద్యార్థులందరూ క్లాస్ రూమ్ లకు వెళ్ళాక హాస్టల్ రూములో ఎవరూ లేని సమయంలో యమున గర్ల్స్ హాస్టల్ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విద్యార్థినిని హుటాహుటిన బైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు ధృవీకరించారు.



# ఎంపీ ఈటలను కలిసిన వైస్ ఛైర్మన్ మేకల రజిత దేవేందర్ రెడ్డి

జయభేరి, మేడ్చల్ :

మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎల్లంపేట మున్సిపల్ వైస్ చైర్మన్ మేకల రజిత దేవేందర్ రెడ్డి. షామీర్ పేటలోని ఈటల నివాసంలో కలసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమెకు ఈటల రాజేందర్ శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపాలిటీ ప్రజలు మన మీద నమ్మకంతో గెలిపించారు వారి నమ్మకాన్ని నిలబెట్టేలా పని చేయాలని సూచించారు. సమస్యలు పరిష్కరించే విధంగా మన కార్యాచరణ ఉండాలని, అందుకు కావాల్సిన నిధులు తీసుకురావడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# సంత్ సేవాలాల్ మహారాజ్ బోధనలు

- సమాజానికి మార్గదర్శకం
- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 25:

బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ అని, ఆయన బోధనలు సమాజానికి మార్గదర్శకమని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జాతీయ ఎస్టి కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్‌తో కలిసి బీర్ల అయిలయ్య వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడిన మహనీయుడు సంత్ సేవాలాల్ అని,గిరిజనులను అహింస వైపు నడిపిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సేవ,సత్యం,సమానత్వం, విలువలు బోధిస్తూ బంజారాల ఐక్యతకు సంత్ సేవాలాల్ మహరాజ్ కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్యమహేందర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు, భువనగిరి ఆర్డీవో కృష్ణా రెడ్డి, డీఆర్డీఓ నాగిరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, బంజారాలు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి ముఠా గుట్టురట్టు

- ముగ్గురు నిందితులను రిమాండ్ కు తరలింపు
- ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎ. బాలరాజు



జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 25 :

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాపై అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. ఫరూక్ నగర్ మండలం చింతగూడ గ్రామ పరిధిలోని శ్రీబాలాజీ పౌల్ట్రీ ఫామ్‌లో టికెదార్‌గా పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన ఆత్మ మహతో తన స్వరాష్ట్రం నుంచి గంజాయి తెచ్చి, చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి బూర్గుల, కాశిరెడ్డిగూడ, చింతగూడ, బాలానగర్, షాద్ నగర్ పరిసర ప్రాంతాల్లోని ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న కార్మికులను లక్ష్యంగా చేసుకుని విక్రయిస్తున్నట్టు సమాచారం అందింది.పక్కా సమాచారంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రంగారెడ్డి డివిజన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం 24 ఫిబ్రవరి సాయంత్రం దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆత్మ మహతోను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 1.7 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకుంది. ఈ అక్రమ వ్యాపారంలో సహకరిస్తున్న బీహార్‌కు చెందిన సుశీల్ కుమార్, ప్రేమ్ రామ్‌లను కూడా అధికారులు అరెస్టు చేశారు. అనంతరం ముగ్గురిని షాద్ నగర్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించగా, కోర్టు ఆదేశాల మేరకు 25 ఫిబ్రవరి న రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎ. బాలరాజు, ఎస్సై కె. వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని అడ్డాకుల మండలం కేంద్రంలో నెక్కొండ నిర్మల, కుమ్మరి నరసింహల గృహప్రవేశ కార్యక్రమాలలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సతీమణి కవితా మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇండ్ల లబ్ధిదారులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి సొంతింటి కల నెరవేర్చిన ఎమ్మెల్యే జీఎంఆర్ కు వారు ధన్యవాదాలు తెలిపారు. అలాగే అడ్డాకుల పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఉప్పరి చెన్నమ్మ, కావలి మన్నెమ్మ ,చాంద్ బిల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యే సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం అక్కడ జరిగిన పలు శుభకార్యాలలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 25 :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక నందు కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపట్టిన ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సును కల్పించారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట సహాయ వ్యవసాయ సంచాలకులు శాంతినిర్మల మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అనేది రసాయన ఎరువులు, కలుపు మందులు, పురుగు మందులు వాడకుండా కేవలం దేశి ఆవు పేడ, మూత్రం ఆధారంగా సాగు చేసే పద్ధతి అని తెలిపారు. ఈ వ్యవసాయ పద్ధతుల్లో జీవామృతం, బీజామృతం వాడటం, అచ్చదనం, మిశ్రమ పంటలు ఇతర సేంద్రీయ పద్ధతులను పాటించడం ద్వారా పెట్టుబడి లేని వ్యవసాయం ఆరోగ్యకరమైన దిగుబడి సాధించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని శ్రీ ఉమా, ఏఈవోలు పృథ్వీరాజ్, దివ్య, కావ్య, జెస్సి, తిరుమలరావు, రాకేష్, కృషి, సఖిలు, కళ్యాణి, మంగ, అఖిల, మండల రైతులు పాల్గొన్నారు.

## అడవి జంతువుల రక్షణకై సోలార్ ఫెన్సింగ్




**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 25 :**

వ్యవసాయంలో అతి పెద్ద సమస్యల్లో అడివి జంతువుల సమస్య ఒకటి అని రైతులు వాపోతున్నారని జిల్లా వ్యవసాయ శాఖ ఏడిఏ శాంతి నిర్మల అన్నారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని పిలుపు సంస్థ ఆధ్వర్యంలో 30 మంది రైతులకు సోలార్ పెన్సింగ్ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ డి ఎస్ ఎస్ ప్రతినిధులు పద్మ, కన్నెగంటి రవి లు మాట్లాడుతూ అడవి జంతువుల సమస్యతో బహుళ పంటల విధానాన్ని మరచి రైతులు వరి పంట మాత్రమే పండిస్తున్నారని, అందుకు అడివి జంతువుల సమస్య ఒక కారణమని అన్నారు. ఈ సమస్యకు సోలార్ ఫెన్సింగ్ ఒక ప్రత్యామ్నాయంగా కనబడుతోందని దానికి దాతల సహాయం ద్వారా పైలెట్ గా చేసి చూపించామని పెద్ద ఎత్తున చేయాలంటే ప్రభుత్వం దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకునే విధంగా రైతులు ప్రయత్నించాలని కోరినట్టు తెలిపారు. ఉద్యానవన శాఖ అధికారి స్రవంతి మాట్లాడుతూ శాఖాపరమైన పరికరాలను తప్పకుండా అందిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని శ్రీ ఉమా, రైతు నేస్తం కార్యనిర్వాహణాధికారి కరుణాకర్ రెడ్డి, పిలుపు సంస్థ వ్యవస్థాపకులు ఎం జనార్దన్, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు కృష్ణ, ఫాతిమా, స్వప్న ప్రవీణ్, సాహితి, రైతులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ చెన్నకేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం



**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 25 :**

తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని శ్రీ చెన్నకేశవ స్వామి గుట్టపైన బుధవారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద బ్రాహ్మణులు కళ్యాణ తంతును కమనీయంగా నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి ఓడిబియ్యాన్ని సమర్పించుకొని మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితుడు అప్పల గోపాల శర్మ, సర్పంచ్ దొమ్మాట అనురాధ బాబు, మాజీ సర్పంచ్ పోగుల ఆంజనేయులు దేవాలయ కమిటీ చైర్మన్ కొక్కొండ సత్తయ్య గౌడ్, ఉప సర్పంచ్ బాల్నర్సయ్య, కమిటీ సభ్యులు పలుగుల లింగయ్య, తడక బాలరాజు, తోడేటి జహంగీర్, పలుగుల నర్సింగరావు, పోగుల నర్సింలు, పలుగుల వెంకటేశ్వర్లు, మంగయ్య గారి వెంకటేష్, దుబ్బాక రవి, హరీష్ గౌడ్, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 25 :**

తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో బుధవారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన తీన్మార్ మల్లన్న గ్రామ యువకులు కొత్తింటి సురేష్,పలుగుల శివకుమార్ బెజ్జనమైన నవీన్ గ్రామంలో పాఠశాల పరిస్థితులను వివరించారు.ఈ సందర్భంగా పాఠశాల పరిస్థితులను పరిశీలించారు. ఒకే గదిలో నాలుగు నుండి ఐదు తరగతులు నిర్వహించడమే కాకుండా అదే ప్రాంగణంలో వంటగది ఇతర కార్యక్రమాలు జరుగుతున్నాయని చూసి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఒక తరగతికి బోధించిన పాఠం మరో తరగతి విద్యార్థులకు అర్థం కావడం లేదని విద్యార్థులు తమ సమస్యను వివరించారు. సరైన వసతులు లేక చదువుకోలేక అంతరాయం కలుగుతుందని వాపోయారు. పాఠశాల పరిస్థితి నత్తనడకగా కొనసాగుతోందని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు. గ్రామ ప్రజలు కూడా పాఠశాల అభివృద్ధి కోసం ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నట్లు అన్నారు.

# చలో సెక్రటేరియట్

- న్యాయవాదులకు తక్షణమే వెంటనే రక్షణ చట్టం తేవాలి
- న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలని న్యాయవాదుల పాదయాత్ర
- భూత్పూర్ నుండి సెక్రటేరియట్ వరకు న్యాయవాదుల పాదయాత్ర
- పాదయాత్ర జిల్లాకు సంబంధించినదే కాదు మొత్తం తెలంగాణకు సంబంధించినది... షాద్ నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాల్ రావు




**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 25 :**

రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, న్యాయవాదుల హత్యలపై స్పందించిన ఉమ్మడి పాలమూరు జిల్లా న్యాయవాదులు న్యాయవాదులకు రక్షణ చట్టం తేవాలంటూ, న్యాయవాదులకు పోలీసులు మరియు ప్రభుత్వం రక్షణ కల్పించాలంటూ భూత్పూర్ నుండి చలో సెక్రటేరియట్ వరకు జరుపుతున్న పాదయాత్రలో భాగంగా పాదయాత్ర షాద్ నగర్ కు చేరుకోగానే షాద్ నగర్ న్యాయవాద బార్ అసోసియేషన్ సభ్యులు, పట్టణ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాలరావు, ప్రధాన కార్యదర్శి గుండుబావి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్రకు సంఘీభావం తెలిపి, పాదయాత్రలో పాల్గొని కోర్టు కాంప్లెక్స్ వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మహబూబ్ నగర్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనంతరెడ్డి, నాగర్ కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు రవికాంత్ రావు, అలంపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం వెంకటేష్, ఆత్మకూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాములు, చేవెళ్ల శ్రీనివాస్ రెడ్డి, అలంపూర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నర్సింలు, యాకూబ్, ఆంజనేయులు, శ్రీధర్ రెడ్డి, నాగయ్య, ఆత్మకూరు బార్ అసోసియేషన్ సభ్యులు నారాయణ గౌడ్ తదితర సభ్యులు భూత్పూర్ నుండి చలో సెక్రటేరియట్ వరకు నిర్వహిస్తున్న పాదయాత్ర షాద్ నగర్ కు చేరుకొని షాద్ నగర్ పట్టణం న్యాయవాదుల సంఘీభావంతో పాదయాత్రను కొనసాగించి షాద్ నగర్ కోర్టు కాంప్లెక్స్ ఎదుట నిర్వహించిన సమావేశంలో పట్టణ న్యాయవాద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాల్ రావుతో పాటు పలువురు మాట్లాడుతూ.... న్యాయవాదులకు రక్షణ చట్టం తేవడంలో, న్యాయవాదులపై దాడులు అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఇంతకుముందు అలంపూర్ నుండి సాగిన పాదయాత్ర కొందరు పెద్దల జోక్యంతో భూత్పూర్ వరకు కొనసాగిందని, ప్రభుత్వం ఈ విషయంపై స్పందించకపోవడంతో తిరిగి సెక్రటేరియట్ వరకు పాదయాత్రను కొనసాగిస్తున్నామని న్యాయవాదులపై విచక్షణ రహితంగా దాడులు జరుగుతున్నాయని, న్యాయవాదుల హత్యలు కూడా కొనసాగుతున్నాయని ఇది పూర్తిగా న్యాయవాదుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యమేనని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టం అమలులోకి తీసుకురావాలని ఈ పాదయాత్ర కేవలం ఉమ్మడి పాలమూరు జిల్లా న్యాయవాదులకు సంబంధించింది మాత్రమే కాదని, పూర్తిగా తెలంగాణ న్యాయవాద హక్కులకై జరుపుతున్న పాదయాత్ర అని, న్యాయవాదుల రక్షణ చట్టం తెచ్చే వరకు ఈ పోరాటం ఆగదని, న్యాయవాదులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులు మరియు ఈ ప్రభుత్వాన్ని దేనిని, అలంపూర్ బార్ అసోసియేషన్ సభ్యులు నిర్వహిస్తున్న ఈ పాదయాత్ర చిన్న విషయం కాదని ఈ విషయాన్ని అందరూ గ్రహించాలని ప్రసంగించారు. తెలంగాణలోని న్యాయవాదులందరూ ఏకమై పోరాడితేనే ప్రభుత్వం దిగివచ్చి తెలంగాణ న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని అమలు చేసే పరిస్థితి ఏర్పడుతుందని న్యాయవాదులందరూ ఏకమై పోరాడాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ పట్టణ సీనియర్ జూనియర్ న్యాయవాదులతో పాటు, మహిళా న్యాయవాదులు, పాదయాత్ర చేస్తున్న అలంపూర్ బార్ అసోసియేషన్ సభ్యులు, మహబూబ్నగర్ జిల్లా బార్ అసోసియేషన్, చేవెళ్ల బార్ అసోసియేషన్ సభ్యులు, ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ సభ్యులు, ఆత్మకూర్ బార్ అసోసియేషన్ సభ్యులు, బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## నేడు దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ పర్యటన

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని ఆయా మండలాలలో గురువారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 1 గంటలకు కొత్తకోట మండలం చర్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారు. 2 గంటలకు కొత్తకోట ఎమ్మార్వో కార్యాలయం వద్ద కొత్తకోట మరియు మదనపూర్ మండలాల రైతులకు సంబంధించిన వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. 2:30 గంటలకు మిరాస్ పల్లి గ్రామంలో అంగన్వాడి సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.సాయంత్రం 3 గంటలకు పామాపురం గ్రామంలో సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభోత్సవం మరియు అంగన్ వాడి భవన నిర్మాణానికి నిర్వహిస్తున్న భూమి పూజ కార్యక్రమంలో పాల్గొంటారు.4 గంటలకు భూత్పూర్ మండలం షేర్ పల్లి, హస్నపూర్, కప్పేట గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలలో పాల్గొంటారని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.కావున ఈ కార్యక్రమాలలో ఆయా మున్సిపాలిటీల చైర్మన్ లు, వైస్ చైర్మన్ లు, కౌన్సిలర్స్, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచ్ లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, యూత్ కాంగ్రెస్, మహిళ కాంగ్రెస్, సేవదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు కోరారు.

## పంచాయతీ సెక్రెటరీ నీ పరామర్శించిన కొండమల్లేపల్లి పాలకవర్గం



**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లి పంచాయతీ సెక్రెటరీ డాకు నాయక్ తన విధులు నిర్వహించుకుని మిర్యాలగూడ కి వెళ్తుండగా మార్గమధ్యంలో కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో స్వల్ప గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న కొండమల్లేపల్లి పాలకవర్గం ఈరోజు వెళ్లి పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంలో కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి, వార్డ్ మెంబర్లు ఊరే నరేష్, గంట మల్లేష్, బిజిలి లింగం, వస్కుల శ్రీను, పర్వతం కొండలు, వస్కుల బక్కలయ్య తదితరులు పాల్గొన్నారు.

# షెడ్ల నిర్మాణానికి అనుమతులు అక్కర్లేదా..?

- గుండ్లపోచంపల్లి డివిజన్ లో యథేచ్ఛగా కమర్షియల్ షెడ్ల నిర్మాణం

**జయభేరి, మేడ్చల్ :**



"నేను కొట్టినట్టు చేస్తా.. నువ్వు ఏడ్చినట్టు చెయ్" అన్నట్లు ఉంది జిహెచ్ఎంసి మేడ్చల్ సర్కిల్ అధికారుల వ్యవహారం. రోడ్డుపై చిరు వ్యాపారులు చేసుకునే దుకాణాల షెడ్లపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరిస్తూ ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఉన్నపళంగా షెడ్లను నేలమట్టం చేసి తమ విధులను నిజాయితీగా చేస్తున్న అధికారులు అక్రమంగా ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేస్తున్న షెడ్ల విషయంలో ఎందుకు అంత ప్రేమ చూపిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని కెవి రెడ్డి నగర్, కండ్లకోయ జాతీయ రహదారి అనుకుని ఎటువంటి అనుమతులు లేకుండా భారీ కమర్షియల్ షెడ్లు నిర్మాణం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనంగా ఉండటంతో అక్రమ షెడ్ల నిర్మాణాలు అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**కొరవడిన అధికారులు పర్యవేక్షణ..**

గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలో కొన్ని ముఖ్య కూడళ్లు, ప్రధాన రోడ్లపై అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. కొందరు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండానే రేకుల పై కప్పులతో ఏకంగా భారీ కమర్షియల్ షెడ్లు నిర్మించి వాటిని వ్యాపార, వాణిజ్య సంస్థలకు అద్దెకు ఇస్తూ రూ.లక్షల్లో ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ప్రభుత్వానికి ప్రతి ఏటా రూ. లక్షల్లో రాబడిని కోల్పోతున్నది. అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన దాఖలాల్లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయాన్ని కోల్పోతుంది. నిబంధనల మేరకు డివిజన్ పరిధిలో ఇల్లు (రెసిడెన్షియల్), దుకాణాలు (కమర్షియల్) నిర్మించే ముందు స్థల యజమాని అన్ని ధ్రువీకరణ పత్రాలు సమర్పించి జిహెచ్ఎంసి అధికారుల నుంచి అనుమతి పొందాలి. ఆ తర్వాతే నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉంటుంది. నిర్మాణం పూర్తయ్యాక డోర్ నంబర్‌తో పాటు అసెస్‌మెంట్ చేయించుకుని ఏటా ఆస్తి పన్ను చెల్లించాలి. కానీ గుండ్లపోచంపల్లి డివిజన్ లో వెలుస్తున్న షెడ్లకు అలాంటి నిబంధనలు వర్తించడం లేదని అధికారులకు అక్రమార్కులకు ఉన్న ఒప్పందం ఏంటో అనే ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఇకనైనా అధికారులు స్పందించి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేస్తున్న షెడ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



# బౌద్ధ బిక్షువుల దమ్మ శాంతి పాదయాత్రకు ఘనస్వాగతం

**జయభేరి, చింతపల్లి, ఫిబ్రవరి 25:**



బుద్ధ భగవానుని పవిత్ర అస్థికలతో బౌద్ధ భిక్షువుల దమ్మ శాంతి యాత్ర తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు, న్యాయవాది బావుండ్లపల్లి చెన్నయ్య ఆధ్వర్యంలో బౌద్ధ బిక్షులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బౌద్ధ బిక్షువులు చేపడుతున్న పాదయాత్రకు చింతపల్లి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున వారికి పూలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బౌద్ధ భిక్షువులు, అంబేద్కర్ సంఘం నాయకులు చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూల మాలను వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుద్దిస్ట్ సొసైటీ ఇండియా తెలంగాణ అధ్యక్షులు పరంధాములు, బావుండ్లపల్లి చెన్నయ్య మాట్లాడుతూ భారతీయ బౌద్ధ సంస్థ (బిఎస్ఐ) ఆధ్వర్యంలో బుద్ధుని అస్థికలను నాగార్జునసాగర్ తీసుకువెళ్లే క్రమంలో పాదయాత్రలో భాగంగా థాయ్ ల్యాండ్, మలేషియా, కంబోడియా, వియత్నాం దేశాల బౌద్ధ బిక్షువులు సుమారు 100 మంది పాదయాత్రలో పాల్గొన్నారు. కర్ణాటక గుల్బర్గా సిద్ధార్థ విహార నుండి ఫిబ్రవరి 2వ తారీఖు నుండి ప్రారంభమైన ఈ దమ్మ శాంతి పాదయాత్ర హైదరాబాద్ మీదుగా బుధవారం చింతపల్లి మండల కేంద్రానికి చేరుకుందన్నారు. ముఖ్య అతిథిగా గగన్ మహల్ హాజరయ్యారు. ఈ కార్యక్రమం అనంతరం జిపి రెడ్డి కన్వెన్షన్ హాల్లో బౌద్ధ బిక్షువులకు బస ఏర్పాటు చేశారు. మార్చి 2వ తేదీ వరకు నాగార్జునసాగర్ బుధవారం చేరుకొని చేరుకుని, బుద్ధుని అస్థికలను అక్కడికి చేర్చి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం పాదయాత్ర ముగుస్తుందన్నారు. ఈ సందర్భంగా వారికి స్వాగతం పలికిన వారిలో బహుజనులు, అంబేద్కర్ సంఘ నాయకులు, అభిమానులు, డాక్టర్ వెంకటేశ్వర్లు, నర్సింగ్ రావు, ఎం. సునీల్ రెడ్డి, గోరేటి గణేష్, బాల్ నారాయణ, వింజమూరు కృష్ణ మాదిగ, ఎర్ర జగన్, ఎలిమినేటి నరసింహ్మా, చెట్టిపల్లి మల్లికార్జున్ కురుమేటి మల్లయ్య, పల్లేటి యాదగిరి, ఆగీరు రవి, వి.కె శీను, సముద్రాల నగేష్, గోవింద్ రవి కుమార్, చెట్లపల్లి హరి ప్రసాద్, వందనపు ఆంజనేయులు, కొప్పుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ నూతన గృహప్రవేశాలు

- అర్హులైన ప్రతి ఒక్కరికి గూడు కల్పిస్తాం...
- తెల్లరేషన్ కార్డుతో.. ఇంటింటికి సన్న బియ్యం
- పేదల సంక్షేమం... కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ
- మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

**జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 25 :**



పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం కాగా, అర్హులైన ప్రతి కుటుంబానికి పథకాలు వర్తింప చేస్తామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వర్గల్ మండల కేంద్రంలో ఇందిరమ్మ నూతన గృహప్రవేశాలు చేయించిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గజ్వేల్ నియోజకవర్గంలో 3 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళా సాధికారత లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించగా, మహిళల చేతుల్లోనే కుటుంబ ఆర్థిక స్థితిలో బాగుంటాయనే లక్ష్యంతో ప్రభుత్వ పథకాలను మహిళల పేరిటనే కేటాయిస్తున్నట్లు చెప్పారు.

అలాగే కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పాటు పాత కార్డులలో సభ్యులను చేర్చి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అంతే కాకుండా పంట రుణమాఫీ, రైతు భరోసా, సన్న ధాన్యానికి రూ 500 బోనస్ తదితర సాహసోపేత నిండాయాలతో పాటు గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు ఉచిత కరెంట్, రూ 500కే వంట గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళలకు వడ్డీ లేని రుణాలు తదితర అందజేస్తున్నట్లు వివరించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త, ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షులు కడపల నర్సింహారెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు బాల్రెడ్డి, నేతలు తవిటి కిష్టయ్య గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, అరవింద్ రెడ్డి, మహేందర్ గౌడ్, వహీద్, యాదయ్య యాదవ్, అయ్యగళ్ళ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరంతరం పోరాటాలు చేస్తుంది

**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 25 :**



తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంతో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంతో పాటు, చిన్న లక్ష్మాపురం, బిలియా నాయక్ తండ, బద్దూ తండ మల్కాపురం, వెంకటాపురం, వీరారెడ్డిపల్లి, తిరుమలపురం, వాసాలమర్రి, కొండాపురం, గోపాలపురం, నాగాయపల్లి గ్రామాల్లో టిఆర్పి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు రాజ్యాధికార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం, బీసీల సామాజిక న్యాయం కోసం తెలంగాణ రాష్ట్రంలో నిజమైన ప్రజా పాలన కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సూదగాని హరిశంకర్ గౌడ్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నరసయ్య గౌడ్, ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ కొమ్మిరి శెట్టి నరసింహులు, మాజీ జెడ్పి వైస్ చైర్మన్ ధనావత్ బిక్కు నాయక్ నాయకులు పాంగల కిష్టయ్య, మోత్కుపల్లి రఘు, శ్రీనివాస్, తలారి రాజేష్, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# బీసీలకు స్థానిక సంస్థ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధత కల్పించాకే ఎన్నికలు జరగాలి

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందుకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ లో ఇచ్చిన మాటకు కట్టుబడి రాబోయే జెడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల్లో 42% బీసీలకు స్థానిక సంస్థల్లో చట్టబద్ధత కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేసి ఢిల్లీలో ఉన్నటువంటి కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి చట్టబద్ధత కలిగినటువంటి రిజర్వేషన్లు ఏర్పాటు చేయడానికి 9వ షెడ్యూల్ లో చేర్చే విధంగా శాశ్వతమైనటువంటి పరిష్కారాన్ని చూపి బీసీలకు న్యాయం చేయాలని కోరారు లేనియెడల బీసీలకు అన్యాయం చేసినట్లు అవుతుందని చరిత్ర హీనులుగా మిగిలిపోతారని చట్టబద్ధత కల్పించాకే ఎన్నికలు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చొల్లేటి భాస్కరాచారి, రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, కడారి రాములు, భీమగోని శివ గౌడ్, బొమ్మిడి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# నవోదయాలో ఫుట్బాల్ పంపిణీ

- విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలి
- మండల బిజెపి అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

**జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 25 :**



వర్గల్ నవోదయలో జిల్లా వ్యాప్తంగా ఉన్న స్కూళ్లలోని ఎంపిక చేసిన విద్యార్థిని విద్యార్థులకు ఫుట్బాల్ పంపిణీ కార్యక్రమం జరిగిందని నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీ దాసి రాజేందర్ తెలియజేశారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ మరియు FIFA (ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఫుట్బాల్) సహకారంతో జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన కొన్ని విద్యాలయాలకు జిల్లా క్రీడా శాఖ అధికారి వెంకట నరసయ్య, బిజెపి మండల అధ్యక్షులు బొల్లిపల్లి తిరుపతి రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పంపరి రమేష్ ఆధ్వర్యంలో పంపిణీ జరిగిందని ప్రిన్సిపాల్ తెలియజేశారు. మన దేశంలో ఇతర క్రీడలతో పాటు ఫుట్బాల్ కు కూడా ఆదరణ ఉండాలని ఆ క్రీడలో కూడా విద్యార్థిని విద్యార్థులు చక్కగా రాణించి తమ ప్రతిభ ప్రదర్శించి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఈ క్రీడల ముఖ్య ఉద్దేశం అన్నారు.ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా వచ్చిన బొల్లిపల్లి తిరుపతి రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ మన భారత ప్రభుత్వము ,మన పార్లమెంట్ వర్యులు రఘునందన్ రావు,క్రీడలకు ఎంతో ప్రోత్సహిస్తున్నారని విద్యార్థిని విద్యార్థులకు పరిపూర్ణ వికాసానికై చక్కటి కార్యక్రమాలను రూపొందిస్తూ వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తుందని ఆయన తెలియజేశారు. ఈ క్రీడలో విశేషంగా రాణిస్తూ ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం అనంతరము విద్యార్థిని విద్యార్థుల మధ్య ఒక ఫ్రెండ్లీ మ్యాచ్ ఫుట్బాల్ గ్రౌండ్లో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆడారు.



# గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో వివాహ సంస్కారం



**జయభేరి, కొండమల్లేపల్లి :**

శాంతి కుంజ్ హరిద్వార్ కొండమల్లేపల్లి శాఖ ఆధ్వర్యంలో, పండిత శ్రీరామ శర్మ ఆచార్య మాత భగవతీ దేవి శర్మ ఆశీస్సులతో మారం ప్రసన్నలక్ష్మి వెంకటేశ్వర్లు వివాహ వార్షికోత్సవ సంస్కారాన్ని గాయత్రీ పరివార్ కార్యకర్తలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండమల్లేపల్లి గాయత్రి పరివార్ ప్రజ్ఞాపీఠ్ వద్ద ఏకకుండీ గాయత్రీ యజ్ఞాన్ని నిర్వహించారు. వాసవి క్లబ్ కార్యదర్శి మారం వెంకటేశ్వర్లు ప్రసన్న లక్ష్మీ వివాహ వార్షికోత్సవ సందర్భంగా వివాహ వార్షికోత్సవ సంస్కారాన్ని హిందూ సంప్రదాయ పద్ధతిలో యజ్ఞం,గాయత్రి మంత్రోచ్ఛరణ, దీపాలు వెలిగించడం,పుష్పాలు, అక్షింతలతో ఆశీర్వదించడం జరిగింది . ఘనంగా సన్మానించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ జన్మదిన సంస్కారం,వివాహ సంస్కారం హిందూ సంప్రదాయం ప్రకారం జరుపుకోవాలన్నారు. మన నడవడిక ఇతరులకు ఆదర్శప్రాయంగా ఉండాలన్నారు. దంపతులిద్దరూ పార్వతి పరమేశ్వరుల వలె ఉండాలన్నారు. గాయత్రీ మంత్రం చాలా పవిత్రమైందని ప్రతి ఒక్కరు గాయత్రి మంత్రాన్ని పఠించాలన్నారు. గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో ప్రతిరోజు గాయత్రీ యజ్ఞాన్ని నిర్వహిస్తున్నామని అందరూ ఆహ్వానితులేనని అన్నారు. అంశదానం, ధనదానం, వస్త్రా దానం వంటి దాన గుణాలను ప్రతి ఒక్కరు కలిగి ఉండాలన్నారు. గాయత్రి యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వింజమూరి చంద్రమౌళి, దాచేపల్లి వసంత వెంకటేశ్వర్లు, నూతనగంటి జగన్, గాజుల అజితా కుషాల్, వాసు, ఏరుకొండ రాము, మంజుల, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమరగార్డ్నిక్ ట్రోఫోబ్లాస్టోమా చికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన యశోద ఆస్పత్రి

**జయభేరి, హైదరాబాద్ :**

అరుదైన ఎముక మజ్జ వ్యాధి 'అమరగార్డ్నిక్ ట్రోఫోబ్లాస్టోమా'తో బాధపడుతున్న 10 నెలల చిన్నారికి యశోద ఆస్పత్రుల వైద్యులు విజయవంతంగా చికిత్స అందించారు. తీవ్ర అనారోగ్య పరిస్థితిలో ఆస్పత్రికి తరలించగా, వైద్యులు వెంటనే పరీక్షలు నిర్వహించి వ్యాధిని గుర్తించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి క్లిష్టంగా ఉండటంతో నిపుణుల బృందం ప్రత్యేక చికిత్స ప్రణాళిక రూపొందించింది. హీమటాలజీ, పీడియాట్రిక్ విభాగాల వైద్యులు సమన్వయంతో ఆధునిక వైద్య పద్ధతులు అనుసరించి చికిత్స చేపట్టారు. నిరంతర పర్యవేక్షణలో చిన్నారికి అవసరమైన సంరక్షణ అందించారు. కొద్ది రోజుల చికిత్స అనంతరం చిన్నారి ఆరోగ్యంలో స్పష్టమైన మెరుగుదల కనిపించింది. ప్రస్తుతం చిన్నారి సాధారణ స్థితికి చేరుకుని కోలుకుంటున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అరుదైన, క్లిష్టమైన వ్యాధుల చికిత్సలో యశోద ఆస్పత్రులు ముందంజలో ఉన్నాయని ఆస్పత్రి ప్రతినిధులు పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు, ఆధునిక సాంకేతిక సదుపాయాలతో ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.



# ప్రజా ప్రభుత్వంతోనే నిరుపేద కుటుంబాల సొంతింటి కళ సాకారం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- షాద్ నగర్ పట్టణంలోని 26వ వార్డులో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 25 :**

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపల్‌లో 26వ వార్డులో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్రమంతో నిరుపేద కుటుంబాల సొంతింటి కళ సాకారం అవుతుందని అన్నారు. పట్టణంలో గ్రామాల్లో అన్ని విధాలుగా సర్వే చేసి గ్రామసభలు పెట్టి ఇందిరమ్మ కమిటీలు, అధికారుల పర్యవేక్షణలో ఇందిరమ్మ ఇల్లు అందిస్తున్నామని అన్నారు. లబ్ధిదారుల ఎంపిక నిష్పక్షపాతంగా పార్టీలకు అతీతంగా జరిగిందని, అర్హులైన పేదలకు అందరికీ విడతల వారిగా ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన ఎన్ఎస్ఎస్ క్యాంప్ విద్యార్థులు




**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 25 :**

తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో భువనగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 విభాగము విద్యార్థులు క్యాంపులో భాగంగా వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులను కలిసి వరి ఇతర వంగడాల పంటల ఉత్పత్తి పెంపొందించే విధానాన్ని చేపట్టే చర్యలను వివరించారు. సేంద్రియ ఎరువుల వాడకం పంటల మార్పిడి వాణిజ్య పంటల నిర్వహణ వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్, కోఆర్డినేటర్ కనక బాలరాజు, ఎన్ఎస్ఎస్ వాలెంటైర్స్ శ్రీకాంత్, గణేష్, వంశీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు పొందాలి

- శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి జాతర వాల్ పోస్టర్ల ఆవిష్కరణ
- శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి గుట్ట మీద దక్షిణ మండప శంకుస్థాపన



**జయభేరి, చింతపల్లి :**

ప్రతి ఒక్కరు శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు పొందాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి గ్రామ పాలక వర్గం,గ్రామ ప్రజలు అన్నారు.చింతపల్లి మండలం తీదేడు గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల (జాతర) సందర్భంగా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి గుట్ట అభివృద్ధి కోసం దేవాలయం వద్ద దక్షిణ మండపం (హాల్) శంకుస్థాపన చేశారు.అనంతరం మాట్లాడుతూ రామలింగేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్,ఆలయ అర్చకులు సురభి సత్యనారాయణ శర్మ సోదరులు,మాజీ సర్పంచ్ కాయితి జితేందర్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్లు ధరణిపతి రమణారావు,ఉలుపాల శేఖర్ రెడ్డి, సోనగంటి గొవర్ధనాచారి, పి.ఏ.సి.యస్ మాజీ డైరెక్టర్ తిరుమణి పాపయ్య,గ్రామ పెద్దలు మద్రు రామారావు,మోర కిరణ్,అంకం అంజూర,తిరుమణి వెంకటయ్య,జూలురి శ్రీధర్,మద్రు శ్రీనివాసరావు,కాయితి బచ్చిరెడ్డి,మద్రు సురేందర్ రావు,జెల్ల వెంకటేశ్వర్లు,రాశిక పాండయ్య,నేలపట్ల మురళి,వీరమల్ల వెంకటయ్య,సిమర్ల శ్రీను యాదవ్,బొడ్డు యాదగిరి,రెడ్డి పరమేష్,ఇడమోని శ్రీను యాదవ్,ఉడుత శంకరయ్య,సివర్ల శంకర్,మెరిక శంకరయ్య,చింతకుంట్ల రాకేష్,వలమోని వెంకటయ్య,మెండె మల్లయ్య,సందె శంకర్,పంబాల చెన్నయ్య,సందె బిక్షం,కొన్రెడ్డి రాజు,తదితరులు పాల్గొన్నారు.



చేర్యాల మున్సిపాలిటీ చైర్ పర్సన్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆత్మీయులు ముస్త్యాల అరుణ బాల నర్సయ్య ని కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

**జయభేరి, హైదరాబాద్**



# మీ జుట్టు వేగంగా.. బలంగా పెరగాలంటే...

**శరీరానికి పూర్తి ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు.**

**జుట్టు పెరుగుదలకు సూపర్ ఫుడ్స్:** జుట్టు వేగంగా పెరగడానికి పోషకాహారం ప్రత్యేక ప్రాముఖ్యత కలిగి ఉంది. సరైన ఆహారం లేకపోవడం, ఒత్తిడి, మారుతున్న జీవనశైలి కారణంగా జుట్టు రాలడం సమస్య వేగంగా పెరుగుతోంది. పరిశోధన ప్రకారం, మన జుట్టులో 90శాతం ప్రోటీన్ అంటే కెరాటిన్‌తో తయారవుతుంది. శరీరానికి పూర్తి ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు.

1. **గుడ్డు** – గుడ్లలో ప్రోటీన్, బయోటిన్, జింక్ పుష్కలంగా ఉంటాయి. జుట్టు నిర్మాణానికి ప్రోటీన్ అవసరం. అంటే కెరాటిన్. బయోటిన్ జుట్టును బలపరుస్తుంది. దాని కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తుంది. జింక్ నెత్తిమీద చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.
2. **పాలకూర** – పాలకూరలో ఫోలేట్‌తో పాటు ఇనుము, విటమిన్ ఎ, సి ఉంటాయి. శరీరానికి ఆక్సిజన్ సరఫరా చేయడం ద్వారా ఇనుము జుట్టు మూలాలను బలపరుస్తుంది. విటమిన్ ఎ, సి తలపై సహజ నూనె అంటే సెబమ్ ఏర్పడటానికి సహాయపడతాయి. ఇది జుట్టు పొడిబారడాన్ని తగ్గిస్తుంది.
3. **బెర్రీలు** – స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్బెర్రీస్ వంటి బెర్రీలలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు కణాలను ఫ్రీరాడికల్ నష్టం నుండి రక్షిస్తాయి. జుట్టు విచ్ఛిన్నతను నిరోధించే కొల్లాజెన్‌ను నిర్మించడంలో సహాయపడతాయి.
4. **చేపలు** – సాల్మన్, సార్డిన్ వంటి చేపలలో ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ డి, ప్రోటీన్లు లభిస్తాయి.. ఇవి జుట్టు మూలాలను బలోపేతం చేస్తాయి. కొత్త జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తాయి. ఒమేగా3 జుట్టు పొడిగా మారడానికి అనుమతించదు.
5. **వాల్‌నట్స్** – వాల్‌నట్స్ ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ ఇ, బయోటిన్‌లకు చాలా మంచి మూలం. అవి జుట్టు కణాలలో వాపును తగ్గిస్తాయి. బలాన్ని పెంచుతాయి. బయోటిన్ జుట్టు రాలడాన్ని నివారిస్తుంది.
6. **క్యారెట్లు** – క్యారెట్లలో బీటాకెరోటిన్, విటమిన్ ఎ ఉంటాయి. ఇవి తల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. జుట్టుకు సహజమైన మెరుపును తెస్తాయి. విటమిన్ ఎ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. జుట్టు విరిగిపోకుండా, రాలకుండా నిరోధిస్తుంది.
7. **విత్తనాలు** – గుమ్మడికాయ, అవిసె, చియా వంటి విత్తనాలలో జింక్, ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ బి పుష్కలంగా ఉంటాయి. అవి జుట్టు ఆకృతిని మెరుగుపరుస్తాయి. కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తాయి.
8. **బీన్స్** – బీన్స్ వంటి ఆహారాలు అంటే కిడ్నీ బీన్స్, చిక్‌పీస్, బ్లాక్ ఐడ్ బఠానీలు ప్రోటీన్, ఐరన్, బయోటిన్‌తో సమృద్ధిగా ఉంటాయి. ఇవి శాఖాహారులకు జుట్టుకు ఉత్తమమైన ఆహారాలు.
9. **చిలగడదుంప** – చిలగడదుంపలో బీటాకెరోటిన్ ఉంటుంది. ఇది శరీరంలో విటమిన్ ఎగా మారి జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తుంది. ఇది తల చర్మం సహజ తేమను కూడా నిర్వహిస్తుంది.

*(NOTE: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు అందించిన సమాచారం ప్రకారం ఇక్కడ తెలియజేయడమైనది. ఆరోగ్యరీత్యా ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది)*





# మీవెంటే మేముంటాం
## హైదరాబాద్ కలెక్టర్ హరిచందన

### ■ పుట్టిన వెంటనే వినికిడి పరీక్షలు చేయించాలి - నిపుణుల సూచన

**హైదరాబాద్, ఫిబ్రవరి 25 :** భారతదేశంలో ప్రతి సంవత్సరం సుమారు లక్ష మంది పిల్లలు వినికిడి లోపంతో పుడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేస్తోంది. మరో నివేదిక ప్రకారం దాదాపు 27 వేల మంది శిశువులు పూర్తి స్థాయి వినికిడి లోపంతో జన్మిస్తున్నారు. గణాంకాల ప్రకారం ప్రతి వెయ్యిమందిలో ముగ్గురు పిల్లలు వినికిడి లోపంతో పుడుతున్నారు. ఈ పరిస్థితి పిల్లల మాట, విద్య, సామాజిక అభివృద్ధిపై దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశం ఉన్నందు వల్ల తొందరగా గుర్తించడం, సమయానికి చికిత్స అత్యంత అవసరమని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. పుట్టుకతో వచ్చే వినికిడి లోపానికి చాలావరకు జన్యుపరమైన కారణాలు ఉంటాయి. శిశువు మాట అభివృద్ధి పూర్తిగా వినికిడి మీద ఆధారపడుతుంది. శబ్దాలను విని, అవి ఎలా పలకాలో నేర్చుకునే ప్రక్రియ ద్వారానే మాట రూపుదిద్దుకుంటుంది. వినికిడి లోపం తొలిదశలో గుర్తించకపోతే స్పీచ్ డెవలప్‌మెంట్ తీవ్రంగా దెబ్బతింటుంది. అయితే ఏడాది లోపు వయసులో సమస్యను గుర్తించి హియరింగ్ ఎయిడ్స్ లేదా అవసరమైతే కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేయిస్తే పిల్లలు సాధారణ పిల్లల్లా మాట్లాడే సామర్థ్యం పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో అంతర్జాతీయ కాక్లియర్ ఇంప్లాంట్ డే సందర్భంగా నగరంలోని మా ఈఎన్‌టీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ.. కలెక్టర్ హరిచందన, వినికిడి లోపంపై సమాజంలో ఇంకా అవగాహన తక్కువగా ఉందని పేర్కొన్నారు. "మా కార్యాలయానికి వినికిడి సమస్యలతో బాధపడుతున్న పిల్లలను తల్లిదండ్రులు తీసుకువస్తున్నారు. హియరింగ్ ఎయిడ్స్ కోసం సహాయం చేయమని అభ్యర్థిస్తున్నారు. అయితే వారిలో చాలామందికి కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు అందుబాటులో ఉన్నాయనే విషయం తెలియదు. ఇకనుంచి ఇలాంటి పిల్లలను మా ఇఎన్ టి డాక్టర్ మేఘనాథ్ దగ్గరికే పంపిస్తాం. మీతో పాటే నేనూ ఉంటా. అందరం కలిసికట్టుగా సహాయం చేద్దాం" అని ఆమె తెలిపారు. పేద కుటుంబాల పిల్లలకు అవసరమైన వైద్య సహాయం అందేలా ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు వైద్య రంగాల సమన్వయం కీలకమని ఆమె అభిప్రాయపడ్డారు. పసిపిల్లలకు ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహించడం, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వైద్య సహాయం అందించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్న మా ఈఎన్‌టీ హాస్పిటల్, మా రీసెర్చ్ ఫౌండేషన్ సేవలను కలెక్టర్ అభినందించారు. ఇప్పటివరకు 700కు పైగా కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలను విజయవంతంగా నిర్వహించిన హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మేఘనాథ్ సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో మాట్లాడిన డాక్టర్ మేఘనాథ్, వినికిడి పరీక్షలను శిశువు పుట్టిన వెంటనే నిర్వహించడం అవసరమని వివరించారు. "బిడ్డ బాగా వినగలిగితేనే మాట్లాడటం, నేర్చుకోవడం సాధ్యమవుతుంది. గ్రోత్ మైల్ స్టోన్స్ పరిశీలించినట్టే వినికిడి సామర్థ్యాన్ని కూడా పరిశీలించాలి. శబ్దాలకు స్పందిస్తున్నారా లేదా గమనించాలి. ఏమైనా అనుమానం ఉంటే వెంటనే నిపుణులను సంప్రదించి పరీక్ష చేయించాలి," అని సూచించారు.





కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ గురించి వివరించిన ఆయన, ఇది చెవి లోపలి భాగంలో పనిచేసే ఎలక్ట్రానిక్ పరికరం అని తెలిపారు. సాధారణ హియరింగ్ ఎయిడ్స్ తో ప్రయోజనం లేని పరిస్థితిలో తీవ్రమైన వినికిడి లోపం ఉన్న పిల్లలకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. చిన్న వయసులో సర్జరీ చేయించుకుంటే మెదడు శబ్దాలను స్వీకరించే సామర్థ్యం మెరుగుపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, తద్వారా స్పష్టంగా మాట్లాడే అవకాశం పెరుగుతుందని వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక కాక్లియర్ ఇంప్లాంట్లు చిన్నవిగా, పైకి కనిపించకుండా ఉండే విధంగా రూపకల్పన చేయబడ్డాయని ఆయన తెలిపారు.

సమయానికి సర్జరీ చేసి, అనంతరం అవసరమైన స్పీచ్ థెరపీ, రిహాబిలిటేషన్ అందిస్తే పిల్లలు సాధారణ పాఠశాలల్లో చదువుతూ ఇతరులతో సమానంగా రాణించగలరని వైద్య నిపుణులు తెలిపారు. "ఆలస్యం అయితే స్పీచ్ పై ప్రతికూల ప్రభావం పడుతుంది. కాబట్టి తొందరగా గుర్తించి చర్యలు తీసుకోవడం అత్యవసరం," అని డాక్టర్ మేఘనాథ్ పేర్కొన్నారు. పేద పిల్లల కాక్లియర్ సర్జరీలకు సహకరిస్తున్నందుకు జిల్లా కలెక్టర్‌కు ఈఎన్‌టీ హాస్పిటల్స్ సీఎండీ సునీత జి. కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. "సమాజంలో అవగాహన పెరిగితేనే మరింత మంది పిల్లలకు సమయానికి చికిత్స అందుతుంది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, వైద్య రంగం కలిసి పనిచేయడం ద్వారా ఒక్క చిన్నారి కూడా వినికిడి లోపంతో వెనుకబడిపోకుండా చూసుకోవచ్చు" అని ఆమె అన్నారు. ఈ సందర్భంగా తమకు సపోర్టుగా ఉన్న రోటరీ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ కు చెందిన శివాని, రాజశేఖర్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు చేయించుకున్న అనేక మంది పిల్లలు తమ ప్రతిభను ప్రదర్శించారు. పాటలు పాడటం, నృత్యాలు చేయడం ద్వారా తల్లిదండ్రులు, వైద్యులు, అతిథులను ఆనందపరిచారు. ఒకప్పుడు శబ్దం వినిపించని ఈ చిన్నారులు, ఇప్పుడు వేదికపై ఆత్మవిశ్వాసంతో నిలబడి తమ అనుభవాలను పంచుకోవడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ప్రతి శిశువుకు పుట్టిన వెంటనే వినికిడి పరీక్షలు నిర్వహించాల్సిన అవసరాన్ని నిపుణులు మరొకసారి రుజువు చేశారు. సకాలంలో గుర్తించడం, సరైన చికిత్స, నిరంతర ఫాలోఅప్... ఇవే పిల్లల భవిష్యత్తును మార్చగల కీలక అంశాలని స్పష్టం చేశారు. అంతర్జాతీయ కాక్లియర్ ఇంప్లాంట్ డే సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం వినికిడి లోపంతో బాధపడుతున్న చిన్నారులకు ఆశాకిరణంగా నిలవాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.



# బర్బెర్రీ 'గోయింగ్-అవుట్ కోట్' లో గ్లోబల్ గ్లామర్!



బర్బెర్రీ సంస్థ ఈ సీజన్ కోసం ప్రత్యేకంగా పరిచయం చేసిన 'గోయింగ్అవుట్ కోట్' కు ఆమె బెస్ట్ అంబాసిడర్‌గా నిలిచింది. లండన్ వీధుల్లో ఈ సుందరి చేసిన ఫ్యాషన్ విన్యాసాల గురించి తెలుసుకుందాం. ఆమె అడుగు పెడితే గ్లోబల్ ఫ్యాషన్ వేదికలు సైతం పులకించిపోతాయి. తన పొడవైన శరీర సౌష్టవంతో ఏ దుస్తులు ధరించినా అందులో ఒక రాయల్ లుక్ తీసుకురావడం ఆమె ప్రత్యేకత. తాజాగా లండన్ ఫ్యాషన్ వీక్ వేదికగా జరిగిన బర్బెర్రీ ఫాల్ / వింటర్ 202627 షోలో ఆమె హాజరైన తీరు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. హాలీవుడ్ దిగ్గజాల మధ్య ఫ్రంట్ రోలో కూర్చుని, తనదైన ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌తో భారతీయ తారల సత్తా చాటిన ఆ స్టార్ హీరోయిన్ మరెవరో కాదు.. కృతి సనన్. బ్రిటిష్ లగ్జరీ ఫ్యాషన్ హౌస్ బర్బెర్రీ ఈ ఏడాది రన్‌వేపై తన మోస్ట్ అవేటెడ్ 'గోయింగ్అవుట్ కోట్'ను విడుదల చేసింది. లండన్ నగర రాత్రి జీవితాన్ని, అక్కడి చల్లని గాలులను ప్రతిబింబించేలా ఈ కోట్ ను డిజైన్ చేశారు. ఇది కేవలం ఒక జాకెట్ మాత్రమే కాదు, సాధారణ సాయంత్రాన్ని సైతం స్టార్‌స్టెడ్ అప్పీల్ తో మార్చేసే ఒక స్టేట్‌మెంట్ పీస్. వింటేజ్ బ్రిటిష్ స్టైల్ కు ఆధునిక హంగులను జోడించి దీనిని తీర్చిదిద్దారు.



# నాని ప్యారడైజ్‌లో హుక్ స్టెప్ కాపీ..


నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ప్యారడైజ్. ఈ సినిమా కోసం అభిమానులు ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. దసరా సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. కొన్ని నెలలుగా ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుగుతుంది. ఇందులో నాని సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. దీంతో ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ పై భారీ బజ్ నెలకొంది. నాని ఈ సినిమాలో డిఫరెంట్ లుక్ తో పాటు యాక్షన్ మోడ్ లో కనిపించనున్నాడు. ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్, సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. తాజాగా ప్యారడైజ్ సినిమా నుంచి ఆయా షేర్ అనే సాంగ్ ను విడుదల చేశారు. అనిరుధ్ ఈ సినిమాకు సంగీతం అందించారు. నాని పుట్టిన రోజు సందర్భంగా ఈ సాంగ్ ని విడుదల చేశారు. విడుదలైన కొన్ని గంటల్లోనే ఈ సాంగ్ సోషల్ మీడియాలో దుమ్మురేపింది. ఎక్కడ చూసిన ఈ సాంగే వినిపిస్తుంది. అలాగే ఈ సాంగ్ లోని హుక్ స్టెప్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. నాని ఈ సాంగ్ లో డాన్స్ అదరగొట్టాడు. ముఖ్యంగా హుక్ స్టెప్ అందరిని విశేషంగా ఆకట్టుకుంది. అయితే ఈ సాంగ్ హుక్ స్టెప్ ను కాపీ చేశారంటూ సోషల్ మీడియాలో కొన్ని మీమ్స్ వైరల్ అవుతున్నాయి. తాజాగా ఓ యూట్యూబర్ మాత్రం ఇందులో నాని వేసిన హుక్ స్టెప్ నాదే అని, కాపీ కొట్టేశారని అంటున్నాడు. బాబా జాక్సన్ పేరుతో ఉన్న ఓ ఇన్ఫ్లుయెన్సర్ సోషల్ మీడియాలో డాన్స్ వీడియోలతో పాపులర్ అయ్యాడు. డిఫరెంట్ డాన్స్ మూవీస్ తో మంచి ఫాలోయింగ్ సొంతం చేసుకున్నాడు. గతంలో ఓ ఫారెనర్ తో కలిసి ఈ డాన్స్ స్టెప్ వేశాడు. అదే స్టెప్ ను ఇప్పుడు నాని ప్యారడైజ్ సినిమాలో కాపీ చేశారని అంటున్నారు. కొంతమంది నెటిజన్స్ ఆ రెండు వీడియోలను పక్కపక్కన పెట్టి ఒరిజినల్, కాపీ అంటూ పోస్ట్ లు పెడుతున్నారు.

# అన్నపూర్ణలో మోషన్ క్యాప్చర్ ఫెసిలిటీ



అన్నపూర్ణ స్టూడియో ఆధ్వర్యంలో సాంకేతికపరంగా భారతీయ సినీరంగంలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. అగ్రకథానాయకుడు అక్కినేని నాగార్జున, నిర్మాత శోభు యార్లగడ్డ స్థాపించిన మిహిరా విజువల్ ల్యాబ్‌లో 'ఏ అండ్ ఎమ్' మోషన్ క్యాప్చర్ ఫెసిలిటీని బుధవారం ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి ప్రారంభించారు. 'వారణాసి'లోని కీలక సన్నివేశాలను ఈ మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ ద్వారా తెరకెక్కించినట్లు ఆయన వెల్లడించారు. హాలీవుడ్‌లో ప్రఖ్యాత మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ భాగస్వామి అయిన యానిమాట్రిక్ ఫిల్మ్ డిజైన్ ఈ ల్యాబ్‌కు సాంకేతిక సహకారాన్ని అందిస్తున్నది. ఈ సందర్భంగా అక్కినేని నాగార్జున మాట్లాడుతూ 'భారతీయ సినీ ప్రయాణంలో ఇదొక కీలక ఘట్టం. ప్రపంచస్థాయి కథలను చెప్పాలని భారతీయ దర్శకులు కలలు కంటున్నారు. అయితే వారికి అత్యాధునిక సాంకేతిక వసతుల కొరత ఉంది. ఇప్పుడు హైదరాబాద్‌లో ఈ ల్యాబ్ అందుబాటులోకి రావడం వల్ల ఎపిక్ అడ్వెంచర్ నుంచి సైన్స్ ఫిక్షన్ డ్రామాల వరకు ఎన్నో కథలను సులభంగా తెరకెక్కించవచ్చు' అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో మిహిరా ల్యాబ్‌ను తీర్చిదిద్దామని నిర్మాత శోభు యార్లగడ్డ తెలిపారు. భారతీయ సినిమాలో 50 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తిచేసుకున్న సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్‌లో మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ సదుపాయాన్ని ప్రారంభించారు.

# విజయ్, రష్మికల పెళ్లి ముచ్చట్లు..



టాలీవుడ్ మోస్ట్ హ్యాపెనింగ్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నల పెళ్లి సందడి అంబరాన్నంటింది. ఉదయ్‌పూర్‌లో ఫిబ్రవరి 25 రాత్రి రిసార్ట్ అంతా పండుగ వాతావరణంతో మార్మోగిపోతోంది. ప్రీవెడ్డింగ్ బాష్, సంగీత్, మెహందీ సెలబ్రేషన్స్‌తో నైట్ పార్టీకి అదిరిపోయే ప్లానింగ్ చేశారు. టాలీవుడ్ నుంచి విజయ్ దేవరకొండకు అత్యంత సన్నిహితులైన తరుణ్ భాస్కర్, శివ నిర్వాణ, వంశీ పైడిపల్లి, సందీప్ రెడ్డి వంగా లాంటి దర్శకులు.. రష్మిక స్నేహితులైన రాహుల్ రవీంద్రన్, ఆషికా రంగనాథ్ లాంటి సినీ ప్రముఖులు ఇప్పటికే అక్కడికి చేరుకుని సందడి చేస్తున్నారు. డ్యాన్సులు, స్పెషల్ పెర్ఫార్మెన్స్‌లతో ఈ రాత్రి ఒక రేంజ్‌లో గ్రాండ్‌గా, ఎంటర్టైనింగ్‌గా సాగనుంది. ఇక అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న ఫిబ్రవరి 26 ఉదయం చాలా సందడిగా ప్రారంభం కానుంది. ఉదయం సుముహూర్తంలో హిందూ సంప్రదాయం ప్రకారం వీళ్ళ వివాహం జరగనుంది. ముహూర్తం ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య ఉండటంతో.. తెల్లవారుజాము నుంచే వేద మంత్రాల నడుమ పెళ్లి తంతు మొదలు కానుంది. పట్టు వస్త్రాల్లో విజయ్, రష్మికల జంటను చూడటానికి రెండు కళ్లు చాలవనేలా ఉదయం షెడ్యూల్ మొత్తం అచ్చమైన తెలుగింటి సాంప్రదాయబద్ధంగా ప్లాన్ చేశారు. రెండు విభిన్న సంప్రదాయాల కలయికగా ఈ పెళ్లి జరగడం విశేషం. ఉదయం తెలుగు పద్ధతిలో పెళ్లి పూర్తయ్యాక, సాయంత్రం రష్మిక సొంత సంప్రదాయం అయిన 'కొడవ' (కూర్గ్‌లో ఉండే ఆచారం) సంప్రదాయం ప్రకారం వీళ్లు మరోసారి పెళ్లిపీటలు ఎక్కనున్నారు. కూర్గ్ స్టైల్‌లో ప్రత్యేకమైన దుస్తులు, వారి సంప్రదాయ ఆచారాలతో ఈ వేడుకను ఎంతో అందంగా డిజైన్ చేశారు. రెండు కుటుంబాల ఆచారాలకు గౌరవం ఇస్తూ ప్లాన్ చేసిన ఈ డబుల్ వెడ్డింగ్ టాలీవుడ్ సర్కిల్స్‌లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. గతంలోనూ కొన్ని జంటలు ఇలా రెండుసార్లు పెళ్లి చేసుకున్నాయి. ఇక సెక్యూరిటీ విషయానికొస్తే.. ఈవెంట్‌కు కేవలం ప్రముఖులు మాత్రమే రానున్నారు. ప్రైవేట్ హెలిప్యాడ్ ఉన్న ఈ రిసార్ట్ చుట్టూ భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ఉదయ్‌పూర్ ఎయిర్‌పోర్ట్‌లో కూడా సెక్యూరిటీని బాగా టైట్ చేశారు. ఫిబ్రవరి 26 ఉదయం 10 గంటలకు తెలుగు సంప్రదాయంలో ఒకసారి.. ఆ తర్వాత సాయంత్రం రష్మిక సొంత సంప్రదాయమైన కొడవ స్టైల్‌లో ఈ జంట ఏడడుగులు వేయబోతున్నారు. పెళ్లి అనగానే ముందుగా గుర్తొచ్చేది భోజనమే కదా..! ఈ రాయల్ వెడ్డింగ్‌లో ఫుడ్ మెనూ కూడా అదే రేంజ్‌లో ఉండబోతోంది. అటు పక్కా తెలంగాణ స్టైల్ మటన్ బిర్యానీ, చికెన్ వంటకాలతో పాటు, ఇటు కర్ణాటక స్పెషల్ బిసిబేళా బాత్, కూర్గ్ స్పెషల్ పోర్క్ కర్రీ వంటి నోరూరించే వంటకాలతో అతిథులకు భారీ విందు ఇవ్వనున్నారు. ముఖ్యంగా రష్మిక ఆచారం ప్రకారం కొడవ సంప్రదాయంలో పోర్క్ కర్రీ (పంది మాంసం)ను ప్రత్యేకంగా వడ్డిస్తున్నారు. టాలీవుడ్ సెలబ్రిటీల కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఈ కాంటినెంటల్, లోకల్ వంటకాల కలబోత అద్భుతంగా ఉండబోతోందని తెలుస్తోంది. ఈ గ్రాండ్ వెడ్డింగ్ జరుగుతున్న రిసార్ట్ కూడా ఏమాత్రం తీసిపోని విధంగా ఉంది. ఇదొక లగ్జరీ డెస్టినేషన్ వెడ్డింగ్ కావడంతో, అతిథుల కోసం బుక్ చేసిన రిసార్ట్‌స్‌లో ఒక్కో గదికి నైట్ రెంట్ ఏకంగా 20 వేల నుంచి 70 వేల రూపాయల వరకు ఉండబోతుంది. అన్ని రకాల విలాసవంతమైన సౌకర్యాలతో టాలీవుడ్ స్టార్లు, బంధువుల కోసం ఈ రిసార్ట్‌స్‌ను పూర్తిగా బుక్ చేసేశారు. దేశం మొత్తం ఇప్పుడు విజయ్ దేవరకొండ, రష్మిక పెళ్లి గురించి మాట్లాడుకుంటుంది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న అత్యంత విలాసవంతమైన ఐటీసీ మెమెంటోస్ రిసార్ట్ విరోష్ వెడ్డింగ్‌కి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ప్రీవెడ్డింగ్ సెలబ్రేషన్స్ అదుర్స్ అనిపించాయి. నాప్‌కిన్స్ మీద కూడా 'VIROSH' అనే ఎంబ్రాయిడరీ చేయించి.. ప్రతి చిన్న విషయంలోనూ ఈ కపుల్ స్పెషల్ కేర్ తీసుకున్నారు. మార్చి 4న హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణలో భారీ ఎత్తున రిసెప్షన్ ఏర్పాటు చేస్తున్నారు.

# డైలీ రొటీన్ తెలిస్తే షాకవ్వాల్సిందే..

తాజాగా ఒక యూట్యూబ్ ఇంటర్వ్యూలో ఏక్తా కపూర్ తన రోజువారీ షెడ్యూల్ గురించి ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. తాను చాలా ఆలస్యంగా నిద్రలేస్తానని ఆమె ఒప్పుకున్నారు. సరిగ్గా ఉదయం 11 గంటలకు ఆమె నిద్ర నుండి మేల్కొంటారు. అయితే, ఉదయం తన కుమారుడిని స్కూల్‌కు పంపే సమయంలో ఒక 10 నిమిషాల పాటు లేచి, మళ్ళీ నిద్రపోతానని.. ఆ సమయాన్ని తాను లెక్కలోకి తీసుకోనని చెప్పారు. చాలా మంది ఉదయం లేవగానే హడావిడిగా ఆఫీసులకు పరుగులు తీస్తుంటే, ఏక్తా కపూర్ మాత్రం తనదైన శైలిలో ప్రశాంతంగా రోజును ప్రారంభిస్తారు. మధ్యాహ్నం వరకు ఫోన్ కాల్స్, స్క్రిప్ట్ చర్చలకే పరిమితం కావడం వెనుక ఒక బలమైన కారణం ఉంది. ఆ సమయంలో ప్రపంచం మొత్తం బిజీగా ఉన్నా, ఆమె తన ఇంటి పరిధిలో ఉంటూ అత్యంత ఏకాగ్రతతో కొత్త కథల గురించి ఆలోచిస్తారు. "నా క్రియేటివిటీకి ఆ నిశ్శబ్ద సమయమే ఊపిరి పోస్తుంది" అని ఆమె తరచూ చెబుతుంటారు. సృజనాత్మక రంగంలో ఉండేవారికి రొటీన్ పనుల కంటే, ఆలోచనలు పంచుకోవడానికి సరైన సమయం దొరకడమే విజయానికి తొలి మెట్టు అని ఆమె నిరూపిస్తున్నారు. అందుకే పాత పద్ధతులకు స్వస్తి చెప్పి, తనకు అనువైన షెడ్యూల్‌ను ఆమె రూపొందించుకున్నారు. విజయం అనేది కేవలం త్వరగా నిద్రలేవడంలోనే లేదు, మనకు దొరికిన సమయాన్ని ఎంత సమర్థవంతంగా వాడుకుంటామనే దానిపై ఆధారపడి ఉంటుందని ఏక్తా కపూర్ నిరూపిస్తున్నారు.



Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**